## మహిళపై దాడి, బెదిరింపుల కేసులో శ్రీ చందు అరెస్ట్



మదనపల్లెక్రైం, జూలై 8 ప్రభాతవార్త.

అప్పు లావాదేవీల వివాదంలో ఓ మహిళ ఇంటిపైకి వెళ్లి దాడి చేసి, బెదిరించి, ఖాళీ ప్రామిసరీ నోట్లపై సంతకాలు చేయించుకున్న కేసులో బహుజనసేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు ను బుధవారం వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టుకు సంబంధించి సీఐ రాజారెడ్డి తెలిపిన వివరాలు వివేకానంద నగర్, వినాయక ఆలయం వెనుక వైపు నివాసముంటున్న కలావతి (44) పెద్ద కుమారుడు అనిల్ కుమార్ భవనాలకు బైండింగ్ పనులు చేస్తుంటాడని, చిన్న కుమారుడు వినోద్ కుమార్ జేసీబీ ఆపరేటర్ గా పనిచేస్తాడు. ఈ క్రమంలో అనిల్ కుమార్ తన స్నేహితుడు నరేంద్ర వద్ద రూ.1 లక్ష అప్పు తీసుకున్నాడు. అందులో రూ.70 వేలు వడ్డీ లేకుండా తిరిగి చెల్లించాడు. మిగిలిన రూ.30 వేల కోసం నరేంద్ర, అతని తల్లి రమనమ్మ, తండ్రి గంగులప్ప రామారావు కాలనీకి చెందిన చంద్రశేఖర్ అలియాస్ శ్రీచందు ప్రోద్బలంతో గత ఏడాది మార్చి 28న శ్రీచందు సూచనల మేరకు కలావతి ఇంటిపైకి వచ్చి, తప్పుడు ఎస్సీ, ఎస్టీ కేసులు పెడతామని బెదిరించి, దూషించి, చంపేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు. అంతేకాకుండా తన కుమారుడిని రుణ గ్రహీతగా, అతని స్నేహితుడిని సాక్షి గా పెట్టి రెండు ఖాళీ ప్రామిసరీ నోట్లపై, రూ.1.85 లక్షల విలువైన మరో ప్రామిసరీ నోటుపై బలవంతంగా సంతకాలు చేయించు కున్నారని పెట్టిన కేసులో విచారణ అనంతరం నరేంద్ర, రమణమ్మ, గంగులప్ప, చంద్రశేఖర్ అలియాస్ శ్రీచందులపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న శ్రీచందును బుధవారం అరెస్టు చేసి స్థానిక కోర్టులో హాజరు పరచినట్లు సీఐ తెలిపారు.


వైఎస్ఆర్

# కడప-అన్నమయ్య



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త



గురువారం 09 జూలై 2026


## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



దువ్వూరు, జూలై 08, ప్రభాతవార్త:

మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునే విధం గా చూడవలసిన బాధ్యత ఉందని ఎంపీడిఓ సుబ్బారెడ్డి, ఈవోపిఆర్డి హరికృష్ణలు తెలిపారు. బుధవారం స్వచ్ఛ పథంలో భాగంగా తెలుగు గంగా బంగ్లాలోని గ్రామ సచివాలయం, రైతు సేవ కేంద్రం వద్ద ఉన్న కంపచెట్లను అలాగే చెత్తా చెదారాన్ని గ్రామపంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందిచె పరిశుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క పంచాయతీ కార్యదర్శి తన గ్రామాల పరిధిలో చెత్తా, చెదారం లేకుండా చూడాలన్నారు. వర్షాలు వస్తున్నందున వ్యాధులు వచ్చే అవకాశం ఉందని జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి ృ, సిబ్బంది పాల్గొన్నారు.

## నాన్న, మీరే నా స్ఫూర్తి..

# మీ ఆశీస్సులే నా ధైర్యం

### మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి

వేంపల్లె:జూలై 08, ప్రభాతవార్త :

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, మహానేత డా.వైఎస్ రాజశేఖర్ రెడ్డికి మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. బుధవారం వైఎస్ఆర్ 77వ జయంతి సందర్భంగా వైఎస్ఆర్ ఘాట్ వద్ద తల్లి విజయమ్మ, సతిమణి భారతీతో కలిసి దివంగత నేతకు నివాళులు అర్పించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. తండ్రిని స్మరించుకుంటూ మిరే నా స్ఫూర్తి..మీ ఆశీస్సులే నా ధైర్యమని వైఎస్ జగన్ భావేద్వేగం అయ్యారు. పెద్ద సంఖ్యలో వైఎస్ఆర్ అభిమానులు, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు ఈ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. జోహార్ వైఎస్ఆర్ అంటూ నినాదాలు చేశారు. వీరందరికీ మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆప్యాయంగా పలికరించారు. ఈ కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్, ఎమ్మెల్యేలు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, డా.దాసరి సుధా, మాజీ ఎమ్మెల్యేలు శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాసులు, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్ రెడ్డి, వేంపల్లె జడ్పీటిసి మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి, వైసిపి కన్వీనర్ చంద్రఓబుల్ రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



### దివంగత వైఎస్ఆర్ లిజెండరీ లీడర్

### ఏపిసిసి చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి

విప్లవాత్మక సంక్షేమ పథకాలతో ప్రజారంజక పాలన అందించిన దివంగత మాజీ సిఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఒక లిజెండరీ లీడర్ అని ఏపిసిసి చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి అన్నారు. బుధవారం ఇడుపులపాయ వైఎస్ఆర్ ఘాట్ వద్ద తల్లి విజయమ్మతో కలిసి దివంగత నేతకు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం షర్మిలా రెడ్డి మాట్లాడుతూ వైఎస్ఆర్ కుటుంబం కోట్ల మంది ప్రజలు కలిగిన పెద్ద కుటుంబమని, వైఎస్ఆర్ చేసిన సంక్షేమ, అభివృద్ధి పనులను ఇప్పటికీ తలుచుకుంటున్నామని వెల్లడించారు. వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా పనిచేసింది ఐదేళ్లు మాత్రమే, కానీ ఆ ఐదేళ్లలో అభివృద్ధి ప్రతి గడపకు చేరిందన్నారు. సిఎంగా రైతులకు ఉచిత విద్యుత్ అందించే ఫైలుపై తొలి సంతకం చేసి రైతు పక్షపాతిగా నిలిచారన్నారు. ఫీజు రీయింబర్స్మెంట్ ద్వారా పేదబిడ్డలు ఎంతోమంది డాక్టర్లు, ఇంజనీర్లు అయ్యారన్నారు. ఆరోగ్యశ్రీ ఎంతోమంది జీవితాలను నిలబెట్టిందన్నారు. వైఎస్ఆర్ కి మరణం లేదని, ప్రతి పేదల గుండెల్లో చిరస్థాయి నేతగా నిలిచే ఉన్నారన్నారు. వైఎస్ఆర్ ని స్మరించు కుంటున్న కోట్లాదిమంది తెలుగు ప్రజలకు రాజశేఖర్ రెడ్డి కుటుంబం తరుపున మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెబుతున్నా అన్నారు.



# రాయచోటిలో అగ్రికల్చర్ కళాశాల

- వ్యవసాయ పరిశోధన కేంద్రం
- నియోజవర్గంలో కేంద్ర ప్రభుత్వ ఆయుష్ కళాశాల
- ఢిల్లీలో మంత్రి మండిపల్లి సుడిగాలి పర్యటన
- నియోజకవర్గ అభివృద్ధి కోసం కేంద్రం నిధులు



కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో మంత్రి మండిపల్లి భేటీ

రాజంపేట, జూలై 8 ప్రభాతవార్త

రాష్ట్ర రవాణా క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రామ ప్రసాద్ రెడ్డి రాష్ట్రానికి వివిధ శాఖల ద్వారా కేంద్ర నిధులు రాబట్టడంతో పాటు రాయచోటి నియోజకవర్గానికి వివిధ శాఖల ద్వారా కేంద్ర సంస్థలు ఏర్పాటు చేయడం, అభివృద్ధి పనులు మంజూరు కోసం దృష్టి సారించారు. ఢిల్లీలో సుడిగాలి పర్యటన చేశారు. కేంద్ర మంత్రులు కలిశారు. రాయచోటిలో అగ్రికల్చర్ కళాశాల, కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆయుష్ కళాశాల,మెడికల్ కళాశాల తో పాటు శిక్షణ, పరిశోధన కేంద్రాలు ఏర్పాటు చేయాలని సంబంధిత మంత్రులను కలిసి కోరారు.రాష్ట్ర రైతాంగ అభివృద్ధికి కేంద్ర సహకారం కోరారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో భేటీ అయ్యారు. రాయచోటి నియోజకవర్గానికి అగ్రికల్చర్ కళాశాల ఏర్పాటు సహా రైతాంగ అభివృద్ధిపై ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి అనేక కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని వివరించారు. రాష్ట్ర రైతాంగానికి మరింత ప్రయోజనం చేకూరేలా కేంద్ర ప్రభుత్వం నుంచి అదనపు సహకారం, ప్రత్యేక పథకాలు, నిధులు అందించాలని కేంద్ర మంత్రిని కోరారు.రాయచోటి నియోజకవర్గంలో అగ్రికల్చర్ కళాశాల ఏర్పాటు చేయడంతో పాటు, రైతులకు ఉపయోగపడే వ్యవసాయ పరిశోధన, శిక్షణ కేంద్రాలను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇటువంటి విద్యా, పరిశోధనా సంస్థలు ఏర్పాటు అయితే గ్రామీణ యువతకు నాణ్యమైన వ్యవసాయ విద్య అందడంతో పాటు, ఆధునిక వ్యవసాయ సాంకేతికత రైతులకు చేరువై వ్యవసాయ రంగం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు.రాష్ట్ర-కేంద్ర ప్రభుత్వాలు సమన్వయంతో కలిసి పనిచేస్తే రైతాంగానికి మరింత మేలు జరిగి, వ్యవసాయ రంగం మరింత బలోపేతం అవుతుందన్న ఆశాభావాన్ని మంత్రి మండిపల్లి కేంద్ర మంత్రితో వ్యక్తం చేశారు. అలాగే కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, ఆయుష్ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య, ఆయుష్ రంగాల అభివృద్ధికి కేంద్రం సహకరించాలని కోరారు. రాయచోటికి కేంద్ర ఆరోగ్య, ఆయుష్ విద్యా సంస్థల మంజూరు చేయాలని కోరారు. రాష్ట్రంలో ఆరోగ్య, ఆయుష్ రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందేలా కేంద్ర ప్రభుత్వం కూడా పూర్తి సహకారం అందించాలని కేంద్ర మంత్రిని కోరారు.అదేవిధంగా రాయచోటి నియోజకవర్గానికి కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో మెడికల్, నర్సింగ్, ఆయుష్ కళాశాల లేదా ఆరోగ్య విద్యా సంస్థలను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా యువతకు విద్య, ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందుబాటులోకి వస్తాయని వివరించారు.అందుకు కేంద్ర మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ సానుకూలంగా స్పందించారని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచస్థాయి బాక్సింగ్ అకాడమీ ఏర్పాటు కోసం ప్రత్యేక చొరవ తీసుకుని భారత మాజీ బాక్సర్ విజేందర్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కలిశారు. రాయచోటిలో బాక్సింగ్ శిక్షణా కేంద్రం ఏర్పాటుపై ప్రత్యేక విజ్ఞప్తి చేశారు.రాష్ట్రంలో క్రీడారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో బాక్సింగ్ అకాడమీ ఏర్పాటు చేసి యువతకు ప్రపంచస్థాయి శిక్షణ అందించేందుకు అవసరమైన సహకారం అందించాలని విజేందర్ సింగ్‌ను కోరారు. పారా క్రీడల అభివృద్ధికి రాయచోటి నియోజకవర్గంలో పారా క్రీడా శిక్షణా కేంద్రం ఏర్పాటుకు న్యూఢిల్లీలో పారా అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు దేవేంద్ర ఝఝారియాని మంత్రి కలిశారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగానికి అత్యంత ప్రాధాన్యత ..మిగతా 2పేజీలో

## ఒంటిల్లులో..

# ఖనిజ నిక్షేపాలు

### ఖనిజ భాండాగారంగా మారనున్న ఒంటిల్లు



మైనింగ్‌కు అనుమతి ఇచ్చిన ప్రదేశాలు

పీలేరు జూలై 8 ప్రభాతవార్త:

అన్నమయ్య జిల్లాలోని పీలేరు మండలం ఒంటిల్లు బ్లాక్ లో250 చ.కి.మీ. విస్తీర్ణంలో అన్వేషణకు అనుమతి ఇచ్చిన కేంద్రం. ఈ నిక్షేపాల వెలికితీతలో టెండర్ ను కోల్ ఇండియా దక్కించుకుంది. ఈ నిక్షేపాల వెలికితీతలో ఎక్స్ప్లోరేషన్ అనుమతి కూడా లభించింది . ఒంటిల్లుచంద్రగిరి బ్లాక్ లోని 250 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో మినరల్స్ అన్వేషణకు కేంద్ర గనులశాఖ టెండర్లకు ఆహ్వానించగా ప్రభుత్వ రంగ సంస్థ కోల్ ఇండియా టెండర్ దక్కించుకుంది అలాగే, రాష్ట్ర ప్రభుత్వం నుంచి లెటర్ ఆఫ్ ఇండెంట్ (ఎల్వోఐ) అందిన ఏడాది లోపు మైనింగ్ ఒప్పందాలు పూర్తి చేసుకుని, క్షేత్రస్థాయిలో సర్వే పనులను వేగవంతం చేయనున్నారు. కోల్ ఇండియా సంస్థ మూడు దశల్లో ఖనిజాన్వేషణ చేయనుంది. ఈ సంస్థ దక్కించుకున్న ఎక్స్ప్లోరేషన్ లైసెన్స్ కింద కేవలం కోర్ డ్రిల్లింగ్ ద్వారా ఖనిజం ఎంత లోతులో ఉంది.. అని తెలుసుకుంటారు. నేరుగా మైనింగ్ తవ్వకాలు చేపట్టరు. 250 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో భూగర్భంలో ఎంత లోతున, ఎక్కడెక్కడ ఖనిజాలు లభ్య మవుతాయో గుర్తిస్తారు. దీని కోసం జీ3, జీ4 స్థాయిలో భూగర్భ సర్వే చేస్తారు. దీనిలో జియోలాజికల్ మ్యాపింగ్, సర్వే, కోర్ డ్రిల్లింగ్ చేస్తారు. ఒంటిల్లుచంద్రగిరి బ్లాక్ ని 250 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో పలుచోట్ల అటవీ ప్రాంతాలు, కొండలు ఉన్నాయి. ఈ సర్వే చేసేందుకు డ్రిల్లింగ్ యంత్రాలు నిషేధిత అటవీ ప్రాంతాల్లో తీసుకెళ్లేందుకు కేంద్ర అటవీ, పర్యావరణ శాఖల నుంచి స్టేజ్1 ఫారెస్ట్ క్లియరెన్స్ తీసుకుంటారు. సర్వే ప్రారం భించే ముందు అన్నమయ్య, తిరుపతి కలెక్టర్ల అనుమతి తీసుకోవడంతో పాటు రెవెన్యూ, మైనింగ్ అధికారుల సమక్షంలో సరిహద్దుల గుర్తింపు చేపడతారు. భవిష్యత్లో మైనింగ్ ..మిగతా 2పేజీలో

# కార్యకర్తల సంక్షేమమే నా ప్రధాన అజెండా

### ధైర్యంగా ఉండండి..అధికారం లోకి వచ్చేది మనమే, మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి

పులివెందుల, జూలై 8, ప్రభాత వార్త :

కార్యకర్తల సంక్షేమమే నా ప్రధాన అజెండా అని ధైర్యంగా ఉండండి అధికారం లోకి వచ్చేది మనమే అని మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి కార్యకర్తలకి అభయం ఇచ్చారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి రెండు రోజుల పులివెందుల పర్యటనలో భాగంగా బుధవారం ఉదయం పట్టణంలోని తన నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలను కలిశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు తమకు ఎదురైన ఇబ్బందులు, అన్యాయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వారి సమస్యలను విన్న వైఎస్ జగన్ స్పందిస్తూ, కార్యకర్తలు ఎవరూ నిరాశ చెందవద్దని, ధైర్యంగా ఉండాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనే అధికారంలోకి వస్తుందని, అన్యాయానికి గురైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా ప్రజలను నిరాశపరిచిందని ఆయన విమర్శించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు.అలాగే వైయస్ అవినాష్ రెడ్డి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అండగా నిలవాలని సూచించారు.





జగన్ కోసం పోటెత్తిన జన సందోహం ప్రజాల సమస్యలు వింటున్న జగన్

**ముగిసిన వైఎస్ జగన్ రెండు రోజుల పర్యటన**

రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం బెంగళూరు నుంచి పులివెందులకు చేరుకున్న వైఎస్ జగన్ ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజలు, పార్టీ శ్రేణుల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం బుధవారం తన తండ్రి, దివంగత ముఖ్యమంత్రి వై యస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి ఆయన సమాధి వద్ద నివాళులర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బెంగళూరుకు బయలుదేరడంతో ఆయన పులివెందుల పర్యటన ముగిసింది.

### ప్రత్యేక ఎస్ఐఆర్ నమోదు శిబిరం



..వార్త 4పేజీలో

## విష రసాయనాలు కలిపి తయారు చేస్తున్న

# పరిశ్రమలు సీజ్

### ఏక కాలంలో 8 చోట్ల దాడులు



ప్రొద్దుటూరు క్రైం, జులై 8, ప్రభాతవార్త:

విష రసాయనాలు కలిపి తయారు చేస్తున్న పేడ రంగు పరిశ్రమలపై ఏక కాలంలో 8 చోట్ల దాడులు నిర్వహించి పెద్ద ఎత్తున పేడ రంగు ఉత్పత్తులను విజిలెన్స్, పోలీసు, రెవెన్యూ, ఫుడ్ సేఫ్టీ అధికారులు స్వాధీనం చేసుకొని పరిశ్రమలను సీజ్ చేశారు. ప్రొద్దుటూరు పట్టణంలోని మదూరు రోడ్డులో ఉన్న సౌభాగ్య పేడ రంగు పరిశ్రమలో తనిఖీలు నిర్వహించిన అధికారులు పేడ రంగు తయారీకి ఉపయోగిస్తున్న నిషేధిత కెమికల్స్ స్వాధీనం చేసుకున్నారు. అలాగే మండీ మర్చెంట్ రోడ్డు, ఆటో నగర్, మరికొన్ని ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. పేడ రంగు ఉపయోగించడం వల్ల మహిళలకు తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అనుమతులు లేకుండా పరిశ్రమలు ఏర్పాటు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. నంద్యాల జిల్లాలో సౌభాగ్య పేడరంగు సేవించి మహిళలు మృతి చెందడంతో అక్కడి జిల్లా కలెక్టరు, ఎస్పీలు పేడ రంగు విక్రయాల కేంద్రాలు సీజ్ చేసన విషయం తెలిసిందే. జిల్లా ఎస్పీ ఆదేశాలతో విజిలెన్స్ సీఐ శ్రీనివాసులురెడ్డి, ప్రొద్దుటూరు వన్‌టౌన్ సీఐ కొండారెడ్డి, రూరల్ సై నాగభూషణ్, సీఐలు వంశీనాథ్, రామాంజనేయులు, ఎస్సైలు, తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజు, ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారులు ఈ దాడుల్లో పాల్గొని పరిశ్రమలను సీజ్ చేశారు.

# హలో...నేను కలెక్టర్‌ను మాట్లాడుతున్నా

### బిఎల్ఓ ఇంటికొచ్చారా... ఓటర్లకు ఫోన్‌చేసి ఆరా తీసిన జిల్లా కలెక్టర్

మదనపల్లె, జులై 8 ప్రభాతవార్త :

హలో...నేను కలెక్టర్‌ను మాట్లాడుతున్నా బిఎల్ఓ మీ ఇంటికొచ్చారా.. ఓటర్లకు నేరుగా ఫోన్ చేసి వారి పనితీరుపై జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. బుధవారం పుంగనూరు నియోజకవర్గంలోని సోమల మండలంలోని 146, 148వ పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. బూత్ లెవల్ అధికారులు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే, హౌస్‌హోల్డ్ ఎన్యూమనేషన్ ఫారాల సేకరణ, కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల వివరాల సవరణ, నివాసం మార్పులు, మరణించిన ఓటర్ల వివరాల నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. పలువురు ఓటర్లకు స్వయంగా పోన్ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ(సర్) కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా చేపట్టాలన్నారు. సర్వే ప్రక్రియలో ప్రజల సంతృప్తి, పారదర్శకత అత్యంత కీలకం అన్నారు. జిల్లాలో అర్హత కలిగిన ఒక్క ఓటు కూడా జాబితా నుంచి మినహాయించబడకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ఓటర్ల వివరాలను నమోదు చేయడంతో పాటు, కొత్తగా అర్హత పొందిన వారి పేర్లను చేర్చడం, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన వారి వివరాలను నమోదు చేయడం, మరణించిన ఓటర్ల వివరాలను సంబధిత ధృవీకరణ పత్రాల ఆధారంగా నిబంధనల మేరకు తొలగించాలన్నారు. అనంతరం సోమల మండలంలోని కందూరు వంకవద్ద ఆరేళ్ళగా మరమ్మత్తులకు నోచుకోక ఉన్న ఆనకట్టను పునర్‌నిర్మించేందుకు జిల్లా కలెక్టర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సిఎస్ఆర్ నుంచి రూ.25లక్షలు మంజూరు చేశారు. ఆధునిక సాంకేతిక పరికరాలతో డ్రైవర్షన్ ఆనకట్టును నిర్మిస్తున్నామన్నారు. నిలిచిపోయిన సాగునీటిసరఫరాను తిరిగి పునరుద్ధంచిడమే లక్ష్యంగా పెట్టుకొన్నట్లు తెలిపారు. ఆనకట్ట పూర్తి అయితే 148.95 ఎకరాల ఆయుకట్టుకు సాగునీరు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.



బిఎల్ఓలను విచారిస్తున్న జిల్లాకలెక్టర్

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

ఐదు లక్షల ఆస్తి నష్టం



**తంబళ్లపల్లె జూలై 8 ప్రభాతవార్త :** ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధమై ఇంటిలోని సామాగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతి అయిన సంఘటన కోసువారిపల్లె పంచాయతీలో జరిగింది. పాపన్న చెరువు పల్లెకు చెందిన భాగ్యమ్మ బుధ వారం ఉదయం కూలి పనులకు వెళ్ళింది. సుమారు 11 గంటల ప్రాంతంలో ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సామాన్లు దగ్ధమై పొగలు రావడంతో గ్రామ స్తులు ఆర్పడానికి చేసిన ప్రయత్నం ఫలించలేదు. ఇంటిలోని రెండు లక్షలు నగదు 10 గ్రాముల బంగారు, బియ్యం, వంట పాత్రలు, సరుకులు, రికా ర్డులు, పాస్ బుక్కులు, కట్టు బట్టలు సైతం కాలి బూడిద అయ్యాయి. ఈ సం ఘటనపై విద్యుత్ శాఖ ఏఈ సురేంద్ర, సిబ్బంది పర్యవేక్షి ంచారు. అగ్ని ప్రమాదంలో సర్వం కాలి బూడిదైన భాగ్యమ్మ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవడానికి ప్రయత్నిస్తామని టిడిపి నాయకులు ఆదిరెడ్డి, కూటమి నాయకులు తెలిపారు.

## రైతు భాందవుడు డాక్టర్ వై.ఎస్.ఆర్.



**గాలివీడు. జూలై 8. ప్రభాతవార్త:** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై ఎస్ రాజశేఖర్ రెడ్డి రైతు భాంద వుడుగా ప్రఖ్యాతి చెందాడని మండల వై.కా.పా. కన్వీనర్,వైస్ యం.పి.పి. మిట్టపల్లి యదు భూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద 77వ జయంతిని పురస్కరించుకొని పూల మాలలు వేసి నివాళ్ళు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ వై ఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజలకు అందజేసిన సంక్షేమ పథకాలు వలన ఆయన ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు.ఈ కార్యక్రమంలో మండల మైనారిటీ నాయకులు ఎస్. కె.ఖాదర్ మొహిద్దిన్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి



**పీలేరు జూలై 8 ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని కలికిరి పట్టణంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్టీడి హరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానేత, దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గొట్టపాలెం ద్వారకనాథరెడ్డి, రామకృష్ణారెడ్డి, కే.ఎం భాష, ఓబయ్య, కుమార్, ప్రభాకర్ రెడ్డి, కెఎంఆర్ బాబాజాన్, లుక్మాన్, సుభాన్, జావీద్, సౌకత్, ముదామిల్, గుండా సతీష్, డీజే శామ్యూల్, విజయ్, ముబారక్, ఇస్తక్ అహ్మద్ గడి, మలతోటి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ అధికారులకు ఘన సన్మానం

**కడప, జూలై 8 ప్రభాతవార్త:** కడప జిల్లా ప్రభుత్వ పెన్షనర్ల సంఘ కార్యాలయంలో సంఘ అధ్యక్షులు రామ మూర్తి నాయుడు, ప్రధాన కార్యదర్శి నాగమునిరెడ్డిల నేతృత్వంలో, 30 జూన్ 2026న పదవీ విరమణ పొంది, పెన్షనర్స్ అసోసియేషన్‌లో సభ్యత్వం తీసుకున్న చింతకొమ్మదిన్నె మండల విద్యాధికారి వెంకట సుబ్బరాయుడు, జడ్పిహెచ్ఎస్ అంగడివీధి ప్రధానోపాధ్యాయులు రవిబాబు, నందిమండలం ప్రధానోపాధ్యాయులు ఈశ్వర్ రెడ్డి, చెన్నూరు బాయ్స్ ప్రధానోపాధ్యాయులు సుబ్బరాజు, కొండపేట ప్రధానోపాధ్యాయులు వెంకటరమణయ్యను రిటైర్డ్ డి ఇఒ రాజేంద్ర ప్రసాద్, అపూర్వ సుందరి పార్వతమ్మ, పుల్లయ్య మరియు సంఘ కార్యవర్గ సభ్యుల చేతుల మీదుగా కండువాలు, పూల బొకేలతో ఘనంగా సన్మానించడమైనది. ఈ సందర్భంగా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ప్రతి సభ్యుని వ్యక్తిగత మరియు పెన్షన్ కు సంబంధించిన అన్ని విషయాలు తీర్చే విధంగా సంఘం పనిచేస్తుందని, అందువల్ల ప్రభుత్వ సర్వీస్ నుండి రిటైర్ అయిన ప్రతి ఒక్కరు సంఘంలో చేరి సంఘ బలోపేతానికి తమ వంతు సహకారం అందించి, పెన్షనర్ల న్యాయమైన కోర్కెల సాధనకు వెన్నుదన్నుగా నిలవాలని కోరడమైనది. సభ్యత్వం తీసుకున్న అధికారులు మాట్లాడుతూ, నేటినుండి జీవితాంతం ఇదే మన సంఘం అని, సంఘ బలోపేతానికి, సమస్యల సాధనకు చిత్త శుద్ధితో మా వంతు సహకారాన్ని అందిస్తామని, మమ్ములను సంఘం లోకి ఆహ్వానించి, ఇంతమంది పెద్దల సమక్షంలో సన్మానించినందుకు, సంఘ సభ్యులందరికి ధన్యవాదములు తెలియజేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, సుభాన్, సుబ్బరాయుడు, లక్ష్మీ ్మనరసయ్య,రామకృష్ణ, మధు, సుబ్బారెడ్డి, రెడ్డెన్న తదితరులు పాల్గొన్నారు. కోశాధికారి నాగేష్ వందన సమర్పణతో సమావేశం ఉత్సాహంగా ముగిసింది.

### బిల్లేరులో గ్రామదేవత ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్టాపన



**చౌడేపల్లి, జూలై 8 ప్రభాతవార్త** మండలంలోని కొండయ్యగారిపల్లి పంచాయతీ బిల్లేరులో శతాబ్దాలనాటి సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తూ భక్తి శ్రద్ధల నడుమ ఎల్లమ్మ దేవత నూతన విగ్రహ ప్రతిష్టా మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం నుంచి అర్చకులు, వేదపండితులు అగ్రహారం ఆనందాచార్యులచే వేద మంత్రోచ్ఛరణల మధ్య పవిత్ర హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా అభిషేకాలు, నాడీసంధానం విగ్రహ ప్రాణ ప్రతిష్ట జరిగింది. నూతన విగ్రహాన్ని విశేష పుష్ప అలంకరణలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది ప్రత్యేకార్చనలు చేసారు. కార్యనిర్వాహకులు వెంకటస్వామి, నారాయణ, వెంకట్రమణ కుటుంబ సభ్యులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. విశేష సంఖ్యలో వచ్చిన భక్తులకు ఎటువంటి ఆటంకం కలగకుండా ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు చేసారు.

### పేదల ఆశాజ్యోతి మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి

**పీలేరు జూలై 8 ప్రభాతవార్త:** అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పేదల గుండెల్లో కొలువైన దేవుడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్. రాజశేఖరెడ్డి అని వైఎస్సార్సీపీ నాయకులు అన్నారు. బుధవారం స్థానిక పీఎల్ఆర్ అపార్ట్మెంట్లో వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైఎస్సార్ ముఖ్యమంత్రిగా నిత్యం ప్రజల సంక్షేమం కోసం పని చేశారని తెలిపారు. వైఎస్సార్ హయాంలో ఆరోగ్యశ్రీ., ఇందిరమ్మ పథకం. విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్మెంట్, పింఛన్లు, రైతులకు రుణమాఫీ, డ్వాక్రా మహిళలకు పావలావడ్డీ రుణాలు, మైనారిటీలకు రిజర్వేషన్లు ఇలా అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పాటుపడ్డారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ దండు జగన్మోహన్రెడ్డి, చంద్రారెడ్డి, మధుసూదన్రెడ్డి, చక్రధర్, మహిత, ఆనంద్, ఉదయ్, షాకీర్, అమరనాథరెడ్డి, లోకనాథరెడ్డి, భువనేశ్వర్రెడ్డి. మహేశ్వర్రెడ్డి, మస్తాన్, దావూద్, సురేంద్రరెడ్డి, సునీల్కుమార్రెడ్డి, కాలనీ చిన్న. లక్ష్మీ ్మ, సపూర, రాజలక్ష్మి ్మ, రాజేశ్వరి. నాగరాజమ్మ, శ్రీనాథరెడ్డి, భాస్కర్రెడ్డి, సి. కె. వెంకటేష్, మునీర్. జనార్ధన్రెడ్డి, రవీంద్రారెడ్డి, రెడెప్పు. నారే వెంకటరమ ణారెడ్డి తదితర వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## పోరాటాలకు మంద కృష్ణ మాదిగను ఆదర్శంగా తీసుకోవాలి

### ఏఎంసీ చైర్మన్ పురం రామమూర్తి



**పీలేరు జూలై 8 ప్రభాతవార్త;** ఎంఆర్‌పిఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ 62వ జన్మదినాన్ని పురస్కరించుకొని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ పీలేరు నియోజకవర్గ ఇన్చార్జి గండికోట వెంకటేష్ ఆధ్వర్యంలో పీలేరు పట్టణం కోటపల్లి క్రాస్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి పీలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామమూర్తి టిడిపి బీసీ సీనియర్ నాయకులు పోలిశెట్టి సురేంద్ర ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన నాయకులు మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ కేవలం మాదిగ సామాజిక వర్గానికి నాయకుడు కాదని ఈ రాష్ట్రంలోనే కాకుండా దేశంలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి తన జీవితాన్ని త్యాగం చేసి పోరాడిన నాయకుడని ఈ రాష్ట్రంలో సమస్యలపై పోరాడేందుకు పాదయాత్రలో మొదలుపెట్టింది,ఉద్యమాలకు పునాదివేసింది మంద కృష్ణ మాదిగ తోనే ఆయన స్ఫూర్తితో అన్ని వర్గాలలో కుల నాయకులు తమ తమ వర్గాలకు నాయకత్వం పేరుతో చలామణి అవుతూ అన్ని సామాజిక వర్గాల నాయకులు పోరాటాలు చేస్తున్నారన్నారు. ఏదైనా ఒక సమస్యపై పోరాటం చేయాలంటే మందకృష్ణ మాదిగను స్ఫూర్తిగా తీసుకొని పోరాడితే విజయం సాధించక తప్పదు అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి బీసీ యువ నాయకులు ఆర్ఎస్ మహేష్, వెంకీ, జాసిన్, దినేష్, ఎం ఈ ఎఫ్ నాయకులు దుద్దు రామకృష్ణ,ఎంఆర్పిఎస్ పీలేరు మండల అధ్యక్షులు గండికోట రెడ్డి కుమార్, కలకడ మండల అధ్యక్షుడు వంగిమల్ల హరినాధ, కె.వి పల్లి మండల అధ్యక్షులు సందిపోగుల రాము, ఎంఎస్పి పీలేరు మండల అధ్యక్షులు ఇంగ్లే బాలసుబ్రమణ్యం, సీనియర్ నాయకులు రాచపల్లి వెంకటరమణ, ఎమ్మార్పీఎస్ యువ నాయకులు యశ్విని, నరసింహ, పవన్, రాము, జానీ, హర్ష,హరీష్, హర్ష, హర్షిత్ తదితరులు పాల్గొన్నారు.

# ఒంటిల్లులో ఖనిజ నిక్షేపాలు

మొదటి పేజీ తరువాయి

లీజు ఇవ్వాలంటే మాత్రం ఎన్విరాన్మెంట్ ఇంపాక్ట్ నిర్వహించడంతోపాటు, స్థానిక ప్రజల అభిప్రాయం తీసుకోవాల్సి ఉంటుంది.

**24 రకాల మినరల్స్:**

ఒంటిల్లు బ్లాక్ లో 24 రకాల రేర్ ఎర్త్, క్రిటి కల్ మినరల్స్ ఉన్నట్లు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా తేల్చింది. ముఖ్యంగా రక్షణ రంగానికి ఉపయోగపడే ఖనిజాలు, ఎలక్ట్రానిక్స్ తయారీ, ఎలక్ట్రికల్ బ్యాటరీలు, పునరుత్పాదక ఇంధనానికి ఉపయోగపడే లెడ్, జింక్, టిటా నియం, ఇడిడియం, కాడ్మియం, మెటల్ జిర్కాన్, సిల్వర్ లాంటి ఖనిజాలు ఈ బ్లాక్ ఉన్నట్లు గుర్తించారు. అలాగే, హోస్టాక్స్(అతిథి రాతి బండలు) లోని గ్రానైట్ పెగ్మటైట్స్, కార్బోనటైట్స్, చార్నోకైట్ శిలాజాలల పొరల్లో ఈ ఖనిజాలు నిక్షి ప్తమై నట్లు గుర్తించారు. కాగా, ఖనిజాన్వేషణ ఫలిస్తే అన్నమయ్య జిల్లా ఖనిజ భాండాగా రంగా నిలవడమే కాక, ప్రభుత్వానికి ఆదాయం తెచ్చే వనరుగా మారనుందని నిపుణులు చెబు తున్నారు.

**ఇవీ నిబంధనలు:**

కోల్ ఇండియా సంస్థకు లభించిన ఎక్స్ ప్లోరే షన్ లైసెన్సు ప్రకారం 5 సంవత్సరాల్లోపు ఈ ఖనిజాన్వేషణ పూర్తి చేయాలి. తొలి మూడు సంవత్సరాల్లో ఖనిజాన్వేషణ పూర్తయ్యాక మినరల్స్ లేవని నిర్ధారించిన ప్రాంతాన్ని తిరిగి ప్రభుత్వానికి అప్పగించాలి. ఖనిజాలు సమృద్ధిగా ఉన్నట్లు తేలిన 25 శాతం విస్తీర్ణంలో (100 చదరపు కిలోమీ టర్లు) మిగిలిన రెండేళ్లలో లోతైన ఖనిజాన్వే షణ నిర్వహించాలి.కోల్ ఇండియా సంస్థ ఈ బ్లాక్ ఖనిజ లభ్యతను నిర్ధారించాలి. భవిష్యత్లో ఇక్కడ చేపట్టే మైనింగ్ ద్వారా వచ్చే లాభాల్లో కోల్ ఇండియా సంస్థకు 0.5 నుంచి 1శాతం రాయల్టీ చెల్లింపులు జరుగుతాయి.



### పీలేరు మండలంలో ఖనిజాలు ఉండటం హర్షించదగ్గ విషయం

**తహసిల్దార్ శివకుమార్**



: పీలేరు మండల పరిధిలోని వంటిల్లు సమీపంలో గల గుట్టలలో మైనింగ్ లో ఖనిజ సంపద ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో తేలటం హర్షించదగ్గ విషయమని పీలేరు తహసిల్దార్ శివకుమార్ అన్నారు. మండల పరిధిలోని కాకుండా చుట్టుపక్కల జిల్లా పరిధిలో రైతులకు వ్యాపారస్తులకు శుభసూచకమని ఆయన అన్నారు.

## రాయచోటిలో అగ్రికల్చర్ కళాశాల

మొదటి పేజీ తరువాయి



కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, ఆయుష్ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్‌తో మంత్రి రాంప్రసాద్ రెడ్డి
కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి వినీల్ కృష్ణతో మంత్రి మండిపల్లి

ఇస్తూ, యువతతో పాటు దివ్యాంగ క్రీడాకారులకు కూడా అంతర్జాతీయ స్థాయి అవకాశాలు కల్పించే దిశగా కృషి చేస్తోందని మంత్రి వివరించారు. ఈ లక్ష్యానికి కేంద్ర సంస్థల సహకారం కూడా అవసరమని పేర్కొన్నారు.ఖేలో ఇండియాకి సంబంధించిన రూ.1000 కోట్ల ప్రతిపాదనలు కార్యరూపం దాల్చేందుకు నిధులు మంజూరు చేయాలని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి వినీల్ కృష్ణ ను మంత్రి కలిసి కోరారు.రాయచోటిలో ఆధునిక ఫుట్ బాల్ టర్ఫ్ నిర్మాణానికి 42.62 కోట్ల కేంద్ర నిధులు మంజూరు చేయాలని మంత్రి కోరారు.కేంద్ర సహకారంతో అన్నమయ్య జిల్లాలో స్పోర్ట్స్ హబ్ ఏర్పాటు దిశగా కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు.

### కోసువారిపల్లె లో వైభవంగా వైయస్సార్ జయంతి వేడుకలు



**తంబళ్లపల్లె జూలై8. ప్రభాతవార్త :** మండలంలోని కోసువారిపల్లెలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర వైఎస్ఆర్సిపి యూత్ జాయింట్ సెక్రెటరీ పి కిషోర్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వైయస్సార్ అమర్ రహే, మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి నినా దాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చెయ్యని సంక్షేమ పథకాల ఆధ్యుడు వైయస్సార్ చరిత్ర పుటల్లో నిలిచిపోయాడని కొనియాడారు. అనంతరం కోసువారిపల్లె పీహెచ్సీలో రోగులకు పాలు పండ్లు పంపిణీ తో పాటు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## వైయస్ జయంతికి మధుకర్ ఆచారి ఆధ్వర్యంలో అన్నదానం



**పెద్దమండెం జూలై 8 ప్రభాతవార్త** మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కలుచర్ల బత్తుల మధుకర్ ఆచారి ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం కేక్ కట్ చేసి నలుగురికి పంచిపెట్టారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలను సూత్రధారి అయినటువంటి రాజశేఖర్ రెడ్డి ఆశయాలను తప్పకుండా పాటిస్తామని వారి అడుగు జాడల్లో నడుస్తామని అన్నారు అనంతరం అన్నదాన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో కడప విశ్వనాథరెడ్డి ఖాదర్ అమీన్ మహమ్మద్ గౌస్ అజమతుల్లా రమణ సాదికలి మాజీ సర్పంచులు విజయ స్వామి వెంకటరమణ తదితర వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## రామసముద్రం మండలంలో ఘనంగా వైయస్సార్ జయంతి వేడుకలు



**రామసముద్రం జూలై 8 ప్రభాతవార్త** రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి 77 వ జయంతి వేడుకలు మండల కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద వైసీపీ మండల అధ్యక్షులు కేశవరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి, ఎంపిపి రమణారెడ్డి జడ్పీటీసీ రామచంద్రా రెడ్డి, గెవన్న భాస్కర్ గౌడ్, దొడ్డిపల్లె ఆనంద స్థానిక వైసీపీ నాయకులతో కలిసి దివంగత మాజీ ముఖ్యమంత్రి వై యస్ రాజశేఖర్ రెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసే ఘన నివాళులర్పించారు. ఆయన ఆశయాలు ఎల్లప్పుడూ ప్రజలకు మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు. అదే ప్రజాసేవా మార్గంలో పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్య మంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ముందుకు సాగుతూ సంక్షేమ పాలన అందించారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేశవరెడ్డి, ఎంపిపి రమణారెడ్డి, జడ్పీటీసీ రామచంద్రారెడ్డి,స్టేట్ వైసీపీ జనరల్ సెక్రటరీ గెవన్న,వైసీపీ సీనియర్ నాయకులు భాస్కర్ గౌడ్,ఎంపిటీసీ మస్తాన్,కేసీ పల్లె ఈశ్వర్ రెడ్డి,తిప్పరాజు,రెడ్డెప్ప నాయుడు, ఉదయ్ శంకర్ రెడ్డి, రాధారెడ్డి, సి హెచ్ ప్రకాష్, దర్శన్ గౌడ్,మండల వైసీపీ పార్టీ అధ్యక్షులు రెడ్డివీరే గౌడ్,వైసీపీ మండలం మైనారిటీ నాయకులు సర్దార్ బాషా,ఎంపిటీసీ రెడ్డెప్ప, విశ్వనాథ్ రెడ్డి,సుభాష్, దిన్నిపల్లె వెంకటరమణ, మాజీ ఉప సర్పంచ్ రమేష్,హరిప్రసాద్ నాయుడు,రెడ్డి శేఖర్ నాయుడు,కత్తి వాలేప్ప, కృష్ణప్ప, నారాయణ స్వామి,శివ,సుధాకర్ రెడ్డి, గొల్లపల్లె నాగరాజ,ఇమ్రాన్, కేశవ,షమి,తదితరులు పాల్గొన్నారు.

# శేష వాహనంపై విహరించిన శ్రీవారు

అడుగడుగునా భక్తులు మంచినీరు వారు పోసి తమ భక్తిని చాటుకున్న భక్తులు



**బద్వేల్ అర్బన్ జూలై 08 ప్రభాతవార్త :** బద్వేల్ పట్టణంలోని సిద్ధవటం రోడ్డు లోని సుమిత్రానగర్ లో వెలిసిన శ్రీ మహాలక్ష్మీ ్మ గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి, శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవస్థానంలో కొనసాగు తున్న శ్రీవారి ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయంధ్వజారోహణం, దేవతాహ్వానం, మహాకుంభ ఆరాధన, చతుస్తా నార్చన, తీర్థప్రస్నాద వినియోగములు (సంతాన ప్రాప్తి కొరకు) గరుడ ప్రసా దాన్ని భక్తులకు ఇవ్వడం జరిగింది, అలాగే సాయంత్రం శేష వాహనంపై శ్రీవారు విహరించారని ఆలయ ధర్మకర్త వల్లంకొండు వెంకటరమణ, సెక్రటరీ గొడిసిపాటి అంకయ్య తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం ఆలయంలో వేద పండితులు సుదర్శన సోమశేఖర్ స్వామి బృందం వీరేష్ చార్యులు,పవన్ స్వామి,బాలాజీ స్వామి,హేమంత్ హేమంత్ స్వామి,వెంకటేశ్వర్లు స్వాముల నేతృత్వంలో ధ్వజారోహణం,దేవతాహ్వానం, మహా కుంభ ఆరాధన, చతుస్థానార్చన,తదితర విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీ వారిని శేషవాహనంపై కొలువుతీర్చి గజమాలలతో అలంకరించి మంగళవాయిద్యాలతో బద్వేల్ పట్టణ పురవీధుల్లో విహరింపజేశారు.భక్తులు గోవింద నామస్మరణతో స్వామివారికి టెంకాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారి మిరమనేలో అడుగడుగునా భక్తులు మంచినీరు వారి పోసి కయాకర్పూరం సమర్పించుకొని పలువురు భక్తులు తమ భక్తిని చాటుకున్నారు, స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా తెల్లవారుజాము నుండి పట్టణ పరిసర ప్రాంత భక్తాదులందరూ విశేష సంఖ్యల తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు, స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు కమిటీ సభ్యులు ప్రత్యేక తీర్థప్రసాదాలను అందజేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో మాలే పెంచల్ రెడ్డి నిమ్మకాయల శివారెడ్డి మాదాపూర్ వెంకటరమణ వల్లంపండు రాఘవేంద్ర అనిత్, సిరిగిరి వెంకటేశ్వర్లు,లేబకు సుబ్బరాయుడు, బండారు సురేష్ బాబు పత్తి హరీష్ మరియు పలువురు భక్తులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు

## ఎస్ఐఆర్ గడువును వెంటనే పొడిగించాలి

ప్రజాస్వామ్య హక్కులను కాలరాయొద్దు




**లక్కిరెడ్డిపల్లి, జులై 08, ప్రభాతవార్త** ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన చివరి గడువు ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో వెంటనే గడువును పొడిగించి ప్రతి అర్హుడికి అవకాశం కల్పించాలని సిపిఐ రాయచోటి నియోజకవర్గం కార్యదర్శి సిద్దిగాళ్ళ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన సమావేశంలో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలు, కార్మికులు, రైతులు, వృద్ధులు, మహిళలు మరియు పేద ప్రజలలో అధిక శాతం మంది ఇంకా నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోలేకపోయారు. సాంకేతిక సమస్యలు, సరైన అవగాహన లేకపోవడం, అధికారుల వద్ద తగిన సౌకర్యాలు లేకపోవడం వల్ల అనేక మంది ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో గడువును ముగించడం అంటే వేలాది మంది ప్రజలను వారి హక్కులకు దూరం చేయడమే అవుతుంది.ప్రజాస్వామ్య హక్కులను కాపాడండి... ఎస్ఐఆర్ గడువును వెంటనే పొడిగించండి! ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కొమ్ము ఓబులేసు, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు, పసల ఆంజనేయులు, చుక్క జగన్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

## మరపురాని మరువలేని దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి

అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి



**లక్కిరెడ్డిపల్లె: జూలై 08 ప్రభాతవార్త :** పేద ప్రజల గుండెచప్పుడు, మరుపురాని, మరుపురాని, అభివృద్ధి ప్రదాత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వైయస్సార్ 77వ జయంతి సందర్భంగా మండలంలోని కస్తూరిరాజుగారిపల్లి గ్రామం చాగలగుట్టపల్లి లోని వైఎస్ కాంస్య విగ్రహానికి గజమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేసి, జోహార్ వైయస్ ఆర్,అంటూ నినాదాలు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టీ పేద ప్రజల గుండెల్లో స్థిర స్థాయిగా నిలిచిన మహనీయుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్,, మండల ఉపాధ్యక్షుడు నాగలక్షమమ్మ సుబ్బారాయుడు, వైఎస్ఆర్సిపి యూత్ అధ్యక్షులు జగన్నాథ నాయుడు , ఎంపీటీసీలు జగన్ మోహన్ రెడ్డి, లక్ష్మీ ్మ నారాయణ, మాజీ ఎంపీ టీసీలు, మాజీ సర్పంచులు, వైఎస్ఆర్ సీపీ నాయకులు,కార్యకర్తలు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న రాజ్యం ప్రజల గుండెల్లో పదిలం

### మిన్నంటిన జయంతి వేడుకలు



**చౌడేపల్లి, జూలై 8 ప్రభాతవార్త** దివంగత ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖర్‌రెడ్డి సుపరిపాలనతో ప్రజ ల గుండెల్లో శాశ్వత ముద్ర వేసుకొన్నారని పలువురు వైకాపా నాయ కులు కొనియాడారు. దివంగత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 77వ జయంతి సందర్భంగా స్థానిక బస్టాండులో గల ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించారు. వైకాపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు నడింపల్లి దామోధర్‌రాజు, వైకాపా మండలాధ్యక్షుడు గౌడప్పగారి నాగభూషణరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆడెం రుక్మిణమ్మ, ఉపాధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, విద్యార్థి విభాగ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కళ్యాణ్ భరత్, పట్టణాధ్యక్షుడు నున్నా భాస్కర్, మాజీ మండలాధ్యక్షుడు కూరపర్తి అంజిబాబు, బోయకొండ మాజీ ఛైర్మన్ మిద్దింటి శంకరనారాయణ, ధర్మకర్త పవన్‌రాయల్, జంగాలపల్లి వెంకట్రమణ, షంషీర్, శ్రీరామ్ భరత్ వరుణ్, అరుణ్‌కుమార్, మండల మహిళా నాయకులు అనుప్రియ, యశోద, తొండా శ్రీరాములు, పాల గంగిరెడ్డి, గ్రెంధెం మంజునాథ్, నారాయణరెడ్డి, హరి, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### పంటభీమాతో రేపటి భవిష్యత్తుకు భరోసా : శివకుమార్



**చౌడేపల్లి, జూలై 8 ప్రభాతవార్త** పంటభీమాతో రైతుల రేపటి భవిష్యత్తుకు భరోసాగా వుంటుందిన పుంగనూరు వ్యవసాయ సంచాలకుడు శివకుమార్ అన్నారు. స్థానిక ఆర్ఎస్‌కే కేంద్రంలో పుంగనూరు, సోమల, సదుం, చౌడేపల్లి మండలాలకు చెందిన రైతులకు పంటలభీమాపై అవగాహన కల్పించారు. ప్రకృతి కన్నెర్ర చేసినా, ఆకాశం ముఖం చాటేసినా రైతులకు పంటల భీమా రక్షణ ఇస్తుందన్నారు. ప్రతి రైతూ పండించే పంటలను ఇ-పంట డీసిఎస్ క్రాఫ్ బుకింగ్ కింద నమోదు చేసుకోవాలన్నారు. పంటల భీమా చేయడం వల్ల కల్గే లాభాలు, ప్రీమియం వివరాలను వివరించారు. మరిన్ని వివరాల కోసం ఆయా ఆర్ఎస్‌కే వద్ద తెలియజేస్తారన్నారు. మండల వ్యవసాయాధికారి మోహన్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

### ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ కనబరచిన ఇంటర్ విద్యార్థినులు

**చౌడేపల్లి, జూలై 8 ప్రభాతవార్త** చౌడేపల్లి ప్లస్ బాలికల జూనియర్ కళశాల విద్యార్థినులు ప్రవేశ పరీక్షల్లో ప్రతిభను కనబరచినట్లు ప్రధానోపాధ్యాయుడు సి.ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. ఇటీవల నిర్వహించిన డైట్, ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించి కళాశాలకు గర్వకారణంగా నిలచారన్నారు. డైట్‌లో ఎం.కల్పన 163వ ర్యాంకు, వి.లలిత 449, ఎస్.సమీరా 536, ఎం.స్వప్న 713, ఎం.ప్రసన్న 1419, సి.భానుశ్రీ 2213వ ర్యాంకు, ఇంజనీరింగ్‌లో వి.లలిత, ఎస్.సంధ్య, జి.తరుణలు ర్యాంకుల్లో ప్రతిభ కనబరచారన్నారు. అధ్యాపకులు సెలవుల్లో సైతం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకొని శ్రద్ధ చూపడం వల్ల ర్యాంకుల పంట పండిందనీ, వారందనీ స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

### ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ



**మదనపల్లెక్రైం, జూలై 8 ప్రభాతవార్త.** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలను మదనపల్లెలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని బుధవారం మదనపల్లె సర్వబోధన ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణంలో రోగులకు, వారి సహాయకులకు పండ్లు, బ్రెడ్, ఓఆర్ఎస్ (ఓఆర్ఎస్) జ్యూస్ పంపిణీ చేశారు. రాజంపేట పార్లమెంట్ సభ్యులు పి.వి. మిథున్ రెడ్డి, మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు, మదనపల్లె నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇన్‌చార్జ్ నిస్సార్ అహ్మద్ ఆధ్వర్యంలో వైఎస్సార్సీపీ యువ నాయకుడు హర్షవర్ధన్ రెడ్డి (హర్ష) ఈ సేవా కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా జీవితాంతం ప్రజా సేవలోనే గడిపిన మహోన్నత వ్యక్తి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి అని కొనియాడారు. వైఎస్సార్ ఆశయాలను స్మరించుకుంటూ, ఆయన జయంతి రోజున ఇలాంటి సేవా కార్యక్రమం చేపట్టడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వైఎస్సార్ చూపిన సేవా మార్గాన్ని ఆదర్శంగా తీసుకుని, భవిష్యత్తులోనూ సమాజానికి ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భయ్యా రెడ్డి, రెడ్డి భాస్కర్, పూర్ణ, రతీష్, అశోక్ రాయల్, కౌశిక్ రాజు, గోవా బ్రదర్స్, గిరీష్, దీపులతో పాటు వైఎస్సార్సీపీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పాల్గొన్నారు.

**CHANGE OF NAME & DATE OF BIRTHI**

KUTAGOLLA ISMAIL, S/o Shaik Hussain, R/o D.No. 6-85, Poreddy varipalle (V), Angallu (P), Kurabala kota (M), Annamayya Dist, AP, have changed my name to SHAIK ISMAIL. I have also corrected my Date of Birth from 15-12-1977 to 09-08-1979. Henceforth, I shall be known as SHAIK ISMAIL with Date of Birth 09-08-1979 for all purposes.

## షటిల్ బస్ సర్వీస్‌లు నడపాలి



వేంపల్లె జూలై 08 ప్రభాతవార్త

జిల్లా కేంద్రమైన కడపకు వెళ్లేందుకు షటిల్ బస్‌లు లేని కారణంగా చాలా మంది ఇబ్బందులు పడుతున్నారని, వీటి దృష్ట్యా వేంపల్లెకడప మధ్య షటిల్ బస్ సర్వీస్ లు నడపాలని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ కోరారు. బుధవారం పులివెందుల ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రేమకుమార్ ని కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే కొంతమంది డ్రైవర్ లు ప్రయాణికులు చేయ్ ఎత్తి ఆపమన్నా బస్సుని ఆపకుండా వెళ్తున్నట్లు డిపో మేనేజర్ కి ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని డిపో మేనేజర్ హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

## మానవసేవయే.. మాధవసేవ

వేంపల్లె జూలై 08 ప్రభాతవార్త



మానవసేవయే మాధవసేవ, పరుల సేవలో పరమాత్ముని సేవ, అన్నదానం మహాదానమని ఏపిసిసి మీడియా చైర్మన్ డా.తులసిరెడ్డి అన్నారు. బుధవారం నల్లచెరువుపల్లి గ్రామానికి చెందిన మునీంద్ర కుమార్‌రెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా స్థానిక అమ్మ అనాథ వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. దాతలు ముందుకు వచ్చి అమ్మ వృద్ధాశ్రమాన్ని సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు రామమునిరెడ్డి, సుశీలమ్మ, మునికుమారి, కృష్ణవేణి, చిన్న, నాయకులు పాల్గొన్నారు.

## ఎన్యూమరేషన్ పారాలు ఆన్లైన్ చేయాలి



సుండుపల్లె, జులై 08,ప్రభాతవార్త :

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన (సర్) సర్వేలో భాగంగా ఏం పిడిఒ కార్యాలయం నందు బుధవారం రాజంపేట సబ్ కలెక్టర్ భావన అధ్యక్షతన కూటమి నాయకులు బూత్ లెవల్ ఏజంట్ల తో సమావేశం ఏర్పాటు చేసి సమీక్షించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న (సర్)సర్వే లో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృస్టుకి మండల అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సందర్బంగా రాయవరం గ్రామం నందు అధికారపార్టీ రెబల్ నాయకుడు మాజీ సర్పంచ్ బిఎల్ఒల దగ్గర నుండి ఎన్యూమరేషన్ పారాలు తీసుకొని ఆన్లైన్ చేయడానికి బిఎల్ఒల దగ్గర ఇవ్వడం లేదని, ఇంకో అధికార పార్టీకి సంబంచిన రెబల్ నాయకుడు ఇరువురు విమర్శణా బాణాలు సంధించుకొన్నారు. అందరు సమ్ నవయంతో పని చేసి ఎన్యూమరేషన్ పారాలు ఆన్లైన్ చేయాలని సబ్ కలెక్టర్ చూచించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ వేణుగోపాల్, ఏంపిడిఒ సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర మాజీ అధికార ప్రతినిది చప్పిడి.మహేష్ నాయుడు, పార్లమెంట్ సమాచార సేకరణ కమిటీ మెంబర్. రెడ్డిరాణి, వైసిపి బూతు కన్వీనర్.రెహమాన్ ఖాన్ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ప్రజల గుండెల్లో నిలిచిన వైఎస్.రాజశేఖర్‌రెడ్డి

### మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ, ఇన్‌చార్జ్‌లు



జయంతి వేడుకల్లో పాల్గొన్న దృశ్యం

మదనపల్లె, జులై 8 ప్రభాతవార్త :

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహావ్యక్తి దివంగత నేత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి అని వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తిప్పారెడ్డి, అనూషారెడ్డిలు తెలిపారు. బుధవారం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా తట్టివారిపల్లె వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకం పేదలకు వరమని, పేదలకు ఇండ్లు, ఫీజు రియంబర్స్‌మెంటు, డ్వాక్రా మహిళలకు పావలా వడ్డీరుణాలు, వృద్దులకు, వికలాంగులకు, వితంతులకు పెన్షన్లు పెంపు లాంటి పథకాలు ప్రవేశపెట్టి పేదల గుండెల్లో నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మెన్ మనూజా, మాజీ వైస్ ఛైర్మెన్ జింకా చలపతి, షమీంఅస్లాం, నాయకులు లియాఖత్, బాలగంగాధర్‌రెడ్డి, బయ్యారెడ్డి, వివిఎస్.రెడ్డి, ఆవుల మల్లికార్జున, మాజీ సర్పంచ్ సిద్దల దీపవేమారెడ్డి, తట్టిశ్రీనివాసులురెడ్డి, చిప్పిలి మల్లికార్జునరెడ్డి, సిద్దల విశ్వనాథ్‌రెడ్డి, ఇర్ఫాన్‌ఖాన్, ఈశ్వర్‌నాయక్, బండపల్లి వెంకటరమణ, శారదారెడ్డి, శ్రీనివాసులు, సిద్దల వేమారెడ్డి, ఎస్.ఎ.కరీముల్లా, తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె, జులై 8 ప్రభాతవార్త :



ముఖ్యమంత్రితో ఎమ్మెల్యే

మదనపల్లె నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్బంగా ముఖ్యమంత్రి మదనపల్లె నియోజకవర్గ పర్యటన, అభివృద్ధి కార్యక్రమాల విషయమై మంగళవారం సాయంత్రం అమరావతి సెక్రటేరియేట్‌లో ముఖ్యమంత్రిని కలిసి ప్రణాళిక పత్రాలను అందజేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. త్వరలోనే ముఖ్యమంత్రి మదనపల్లె పర్యటనకు విచ్చేస్తున్నట్లు తెలిపారు. మదనపల్లె నియోజకవర్గ అభివృద్ధికి నిధుల మంజూరు విషయంలో కూడా సిఎంకు తెలియజేసినట్లు తెలిపారు. నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

## బీజేపీ బలోపేతానికి చిట్టిబాబు పిలుపు

నందలూరు, జులై 8 ప్రభాతవార్త :

మండలంలో భారతీయ జనతా పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని కడప జిల్లా బీజేపీ నూతన ఇన్‌చార్జ్ చిట్టిబాబు పిలుపునిచ్చారు. రాజంపేట నియోజకవర్గ పర్యటనలో భాగంగా నందలూరుకు విచ్చేసిన ఆయనకు మండల అధ్యక్షుడు చుక్కా శ్రీను, రైల్వే కన్సల్టేటివ్ మెంబర్ రాచూరి మురళి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని సూచించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకులచే జయంతి వేడుకలు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మదనపల్లె, జులై 8 ప్రభాతవార్త :

మాజీ ముఖ్యమంత్రి దివంగతనేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు బుధవారం కాంగ్రెస్ నాయకులచే పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రెడ్డిసాహెబ్ ఆధ్వర్యంలో వైఎస్. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెడ్డిసాహెబ్ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి వైఎస్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి కొనియాడారు. అనేక సంక్షేమ పథకాలు చేపట్టి వైఎస్ఆర్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. ప్రధానంగా ఆరోగ్యశ్రీ, ఫీజు రీయంబర్స్‌మెంటు, కార్పోరేట్‌వైద్యం, 108లను ప్రవేశపెట్టి ప్రజలకు ఎంతో సేవ చేశారన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు మీనాకుమారి, శరత్‌కుమార్‌రెడ్డి, ముభారక్‌ఖాన్, అప్సర్ షరీఫ్, ఈశ్వరయ్య, మహమ్మద్‌షరీఫ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదంలో రూ 2. లక్షల ఆస్తి నష్టం.

కురబలకోట జులై 8 ప్రభాతవార్త

తంబళ్లపల్లి మండలం మండలం కోసువారి పల్లి గ్రామం పాపిని చెరువు పల్లెలో బుధవారం ఉదయం అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో పాపిని చెరువు పల్లి కి చెందిన వెంకటరమణ ఇంటిలోనీ వస్తువులు, దాచుకున్న డబ్బులతో పాటు ఆధార్, పాస్ పుస్తకాలు, ఇతర పత్రాలు, ధాన్యం కాలిపోయాయి. స్థానికులు మంటలను ఆర్పి వేశారు. సమాచారం అందుకున్న మదనపల్లి అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని మంటలను పూర్తిగా ఆర్పివేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం సంభవించినట్లు బాధితుడు వెంకటరమణ తెలియజేశారని మదనపల్లి అగ్నిమాపక అధికారి శివప్ప చెప్పారు. సుమారు రూ1.90 లక్షల ఆస్తి నష్టము జరిగినట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు అగ్నిమాపక అధికారి శివప్ప తెలిపారు. ఆ పల్లెలో అగ్ని ప్రమాదాలు, వాటి నివారణపై ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు.

## సంక్షేమ పథకాలే వైయస్సార్‌ను ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిపాయి

ప్రొద్దుటూరు, జులై 8, ప్రభాతవార్త



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పేద ప్రజలకు మేలు చేసేందుకు అమలు చేసిన సంక్షేమ పథకాలే డాక్టర్ వైయస్సార్‌ను ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిపాయని మాజీ ఎమ్మెల్యే వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు జమ్ములమడుగు నియోజకవర్గ పరిశీలకులు పోరెడ్డి నరసింహారెడ్డి, మాజీఎంపిపి శేఖర్ యాదవ్, మాజీ ఆప్కాబ్ పర్సన్ ఇంచార్జ్ మల్లెల ఝాన్సీ, మాజీ కౌన్సిలర్లు, పట్టణ వైసీపీ మహిళా అధ్యక్షురాలు చింతల దానమ్మ, వైసీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు

సిద్ధవటం జూలై,8 ప్రభాతవార్త

ఒంటిమిట్ట సర్కిల్ పరిధిలోని సిద్ధవటం, నందలూరు, ఒంటిమిట్ట మండలాల్లో ప్రజలను భయభ్రాంతులను గురిచేస్తూ రౌడీయిజం చేస్తే ఉపేకించే పరిస్థితి లేదని రౌడీ షీటర్ల పై నిఘా వేసి ఉంచామని ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు మండల కేంద్రమైన సిద్ధవటం పోలీస్ స్టేషన్లో ఆయన బుధవారం మాట్లాడుతూ పెన్నా పరివాహ ప్రాంతాలలో అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణా పాల్పడితే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశాలు తప్పనిసరిగా పాటించాలని ఇసుక అక్రమ రవాణా దారులకు ఆయన హెచ్చరించారు పెన్నా పరివాహ ప్రాంతాలలో ఇసుక రవాణా జరుగుతున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారని కొన్ని ప్రాంతాలలో నిఘా వేసి ఉంచామని ఇసుక అక్రమ దారులకు ఆయన హెచ్చరించారు రౌడీ షీటర్లు గ్రామాలు ప్రశాంతత వాతావరణంలో ఉండేటట్లు సహకరించాలని రౌడీయిజం చేస్తే కఠినమైన చర్యలు తప్పవని తెలిపారు అసాంఘిక కార్యక్రమాలకు ఎవరైనా పాల్పడితే చట్టరీత్య చర్యలు తీసుకుంటామన్నారు.

## రిమ్స్ డెంటల్ హాస్టల్‌లో ఆహార నాణ్యతపై విచారణ జరపాలి

### మెస్ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల డిమాండ్

పులివెందుల, జూలై 8, ప్రభాతవార్త :



కడప రిమ్స్ డెంటల్ కళాశాల హాస్టల్‌లో అందించిన ఆహారం నాణ్యతపై సమగ్ర విచారణ చేపట్టి, నిర్లక్ష్యానికి బాధ్యులైన మెస్ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా బంజారా స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రమావత్ జగన్ రాథోడ్, అంబేద్కర్ స్టూడెంట్ యూత్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఓబయ్య, ఆల్ ఇండియా స్టూడెంట్ పవర్ కడప జిల్లా అధ్యక్షుడు దినేష్ డిమాండ్ చేశారు. హాస్టల్‌లో మంగళవారం రాత్రి దోసెలు తిన్న అనంతరం 27 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురై రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. బుధవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించిన విద్యార్థి సంఘాల నాయకులు అనంతరం మీడియాతో మాట్లాడారు. హాస్టల్‌లో విద్యార్థులకు నాణ్యతలేని ఆహారం అందించడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని వారు ఆరోపించారు. విద్యార్థుల ప్రాణాలతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించబోమని, ఇలాంటి ఘటనలు పునరావృతమైతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐబీఎస్‌యూ నగర నాయకుడు నిత్య, దినేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## కరెంటు స్తంభం విరిగిపడి వృద్ధ దంపతులు మృతి

మైదుకూరు, జూలై 08, ప్రభాతవార్త:



మైదుకూరు స్థానిక బద్వేల్ రోడ్డులోని ఆకుల వీధిలో తెల్లవారు జామున 3 గంటల సమయంలో జరిగిన విషాద ఘటనలో వృద్ధ దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. ఆకుల వీధిలో లారీ వెళ్తుండగా అకస్మాత్తుగా పైనున్న కరెంటు తీగలకు తగలడంతో విద్యుత్ స్తంభం విరిగి అక్కడే నిద్రిస్తున్న పందిటి సుబ్బరాయుడు అలియాస్ పాండురంగ వయసు 80 సంవత్సరాలు, భార్య పందిటి ఓబులమ్మ వయసు 75 సంవత్సరాలు విద్యుత్ స్తంభం వారి మీద పడబడడంతో అక్కడికక్కడే మృతి చెందారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# తొండూరు అభివృద్ధిపై టీడీపీ మండల కమిటీ తీర్మానాలు

### పింఛన్లు, రోడ్లు, ఐటీఐ కళాశాల పనుల ప్రారంభంతో పాటు తొమ్మిది కీలక అంశాలపై చర్చ

పులివెందుల, జూలై 8 ప్రభాతవార్త :

నియోజకవర్గ పరిదిలోని తొండూరు మండల టీడీపీ ఇంచార్జ్ శివ మోహన్ రెడ్డి నివాసంలో ఆయన అధ్యక్షతన మండల పార్టీ నాయకులు, బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల ప్రజలకు సంబంధించిన పలు సమస్యలు, అభివృద్ధి పనులపై విస్తృతంగా చర్చించి మొత్తం తొమ్మిది కీలక తీర్మానాలను ఆమోదించారు. మండలంలో అర్హులైన వితంతువులు, వృద్ధులకు పెండింగ్‌లో ఉన్న పింఛన్లను వెంటనే మంజూరు చేయాలని సమావేశం తీర్మానించింది. గ్రామీణ ప్రాంతాల్లో మట్టి రోడ్ల నిర్మాణాన్ని చేపట్టాలని, మండల కేంద్రంలో నిలిచి పోయిన ఐటీఐ కళాశాల నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరింది. అదేవిధంగా మల్లెల గ్రామం నుంచి ఊడవగండ్ల వరకు తారు రోడ్డు నిర్మించాల ని, చెర్లోపల్లి తుమ్మల గంగమ్మ ఆలయం వరకు సిమెంట్ రోడ్డు వేయాలని తీర్మానించారు. పోతులపల్లి హిందూ శ్మశాన వాటికకు రహదారి ఏర్పాటు చేయడం, గ్రామంలో తాగునీటి పైపులైన్ సమస్యను పరిష్కరించడం అవసరమని పేర్కొన్నారు. గంగదేవిపల్లి గ్రామంలో శ్మశాన వాటిక నిర్మాణ పనులను పూర్తి చేయడంతో పాటు ఎస్సీ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టాలని సమావేశంలో కోరారు. మండల అభివృద్ధికి సంబంధించిన ఈ అంశాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు నిర్ణయించారు. ఈ సమావేశంలో క్లస్టర్ ఇంచార్జ్ కంచిరెడ్డి, తొండూరు-సింహాద్రిపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ రామసూరా రెడ్డి, మండల సొసైటీ అధ్యక్షుడు సూర్యనారాయణ రెడ్డి, నాగిరెడ్డి గంగయ్య, నాగఅంజినేయులు రెడ్డి, శివ భాస్కర్ రెడ్డి, గవేంద్ర రెడ్డి, రామచంద్ర రెడ్డి, భాస్కర్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మండల అభివృద్ధిపై టీడీపీ మండల కమిటీ తీర్మానాలు చేస్తున్న దృశ్యం

## ఘనంగా రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు



బద్వేలు అర్బన్, జూలై 8, ప్రభాతవార్త

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా బుధవారం అట్లూరు మండలంలోని అట్లూరు క్రాస్, రెడ్డిపల్లి, కొండూరు, కుంభగిరి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాలకు వైఎస్సార్సీపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. అనంతరం అట్లూరులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అట్లూరు మండల పార్టీ అధ్యక్షుడు ముడమాల ప్రభాకర్ రెడ్డి, వైఎస్సార్సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బోవిళ్ల చిన్న సూరారెడ్డి, మాజీ ఫారెస్ట్ డైరెక్టర్ రొండా మల్లికార్జున రెడ్డి, డీఎల్‌డీఏ చైర్మన్ రొండా మాధవరెడ్డి, మాజీ జడ్పీటీసీ అందూరి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నవోలు బ్రహ్మానందరెడ్డి, యువ నాయకులు గజ్జల నరసారెడ్డి, మాజీ యూత్ లీడర్ (ఎన్ఆర్ఐ) బోవిళ్ల పిచ్చిరెడ్డి, దున్నూతుల రాజగోపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ పెరుగు గంగయ్య, చెవుల రమణయ్య, కంభం శివారెడ్డి, లక్ష్మీరెడ్డి, గంగిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, డీలర్ కృష్ణారెడ్డి, పల్లెం యల్లారెడ్డి, తిరుపాల్, లక్ష్మయ్యతో పాటు పలువురు వైఎస్సార్సీపీ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కంటి పరీక్షల శిబిరానికి విశేష స్పందన

ప్రొద్దుటూరు అర్బన్,జులై 8 ప్రభాత వార్త

ప్రజలకు ఉచిత నేత్ర వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్వహించిన కంటి పరీక్షల శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో నూరుమందికి పైగా పరీక్షలు నిర్వహించి, శస్త్రచికిత్స అవసరమైన వారిని గుర్తించి తదుపరి చికిత్సకు ఏర్పాట్లు చేశారు. రోటరీ సర్వీస్ కాంప్లెక్స్ ట్రస్ట్ ప్రొద్దుటూరు, రోటరీ క్లబ్ ప్రొద్దుటూరు, జిల్లా అంధత్వ నివారణ సొసైటీ కడప సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఈశ్వర్‌రెడ్డి నగర్‌లో ఉచిత కంటి (ఐఒఎల్) పరీక్షల శిబిరం నిర్వహించారు. ప్రముఖ రోటరీ కంటి ఆసుపత్రి వైద్య బృందం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించింది. సమీప ప్రాంతాలకు చెందిన నూరుమందికి పైగా ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు. పరీక్షల అనంతరం శస్త్రచికిత్స అవసరమైన వారిని గుర్తించి, వారికి ఆపరేషన్ల తేదీలను నిర్ణయించి సమాచారం అందించారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ సర్వీస్ కాంప్లెక్స్ ట్రస్ట్ అధ్యక్షుడు ఎంవీఎన్ ప్రభు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు కోవూరు రమేష్ రెడ్డి, ట్రస్ట్ కార్యదర్శి జాకీర్ అహ్మద్, జాయింట్ కార్యదర్శి బాల సూర్యరావు, సభ్యులు కే. మల్లికార్జున, ఎం. సూర్యనారాయణ రెడ్డి, రోటరీ క్లబ్ ఉపాధ్యక్షుడు కొవ్వూరు రవికుమార్ రెడ్డి, కార్యదర్శి గండ్లూరు శ్రీధర్ శర్మ, జాయింట్ కార్యదర్శి వద్ది రవికుమార్, రోటేరియన్లు శ్రీరాములు వెంకటేష్, జి. రమణాచారి తదితరులు పాల్గొన్నారు.




# పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నేత వైఎస్ఆర్

జమ్మలమడుగు, జులై 8, ప్రభాతవార్త:

పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య చికిత్సలు అందించిన గొప్ప నేత డా.వైఎస్.రాజశేఖర్‌రెడ్డి అని పేదల గుండెల్లో చిరస్థాయిగా ఆయన నిలిచిపోయారని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. బుధవారం వైఎస్ఆర్ 77వ జయంతిని పురస్కరించుకొని స్థానిక వైసీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి టీటీడీ నారాపుర దేవాలయం వద్ద ఉన్న దివంగత వైఎస్ఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా వైఎస్ఆర్ నిలిచారని కొనియాడారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గెలుపు తథ్యమని వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్ఆర్ కలలు గన్న ఆంధ్ర రాష్ట్రాభివృద్ధిని తెస్తారని తెలిపారు. దివంగత వైఎస్ఆర్ అడుగు జాడల్లో నడుస్తూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను ఆదరిస్తూ ప్రతి ఒక్కరికి కేంద్ర, రాష్ట్ర సంక్షేమ ఫలాలు అందించేందుకు వైఎస్ఆర్ ప్రభుత్వం తప్పక వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్మన్ ముల్లా జానీ, వైసీపీ నాయకులు మలికిరెడ్డి హనుమంతరెడ్డి, దన్నవాడ మహేశ్వరరెడ్డి, వైసీపీ మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షుడు వళ్లంబాయి రిషికేశవరెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ 77వ జయంతి వేడుకలు



మైదుకూరు, జూలై 08, ప్రభాతవార్త:

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలను వైఎస్ఆర్ జిల్లా మైదుకూరులో మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామి రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామి రెడ్డి మాట్లాడుతూ, డాక్టర్ వైయస్ఆర్ మరణించి 17 సంవత్సరాలు అయినా నేటికీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన నాయకుడని కొనియాడారు."రాష్ట్రంలో ఎందరో ముఖ్యమంత్రులు వచ్చినా, ప్రజల మదిలో శాశ్వతంగా నిలిచిన పథకాలు ఆరోగ్యశ్రీ, ఫీజు రియంబర్స్మెంట్, 108, 104 లాంటి ఎన్నో ప్రజా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో శాశ్వత స్థానం సంపాదించారు" అన్నారు అనంతరం మాజీ ఎమ్మెల్యే రఘురామి రెడ్డి వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కేశా లింగన్న, మూలే భరత్ కుమార్ రెడ్డి, చాపల షరీఫ్, కిరణ్ మై, విత్తనాల సుబ్బారెడ్డి, రఘురామి రెడ్డి,మరియు అన్ని మండలాల వైఎస్ఆర్సీపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ జయంతి వేడుకలు

దువ్వూరు, జూలై 08, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన దువ్వూరులోని మూడు రోడ్ల కూడలి లో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద వైకాపా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైకాపా నాయకులు మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వైయస్ రాజశేఖర్ రెడ్డి అని, ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ఎంతో మందికి లబ్ధి చేకూరింది అన్నారు. అలాగే ఎర్రబల్లె, గుడిపాడు, కృష్ణంపల్లె, మదిరేపల్లె తదితర గ్రామాల్లో 77వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మండల వైకాపా కన్వీనర్ ఇరగం రెడ్డి శంకర్ రెడ్డి, ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, జడ్పిటిసి ఏరువ కృష్ణయ్య, ఓబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఎట్టకేలకు కాలువ పనులు ప్రారంభం

ప్రొద్దుటూరు క్రైం, జులై 8, ప్రభాతవార్త:

రిలయన్స్ పెట్రోలు బంకు వద్ద నుంచి ఎర్రగుంట్లకు వెళ్లే ప్రధాన రహదారి వరకు కాలువ పనులు గతంలో కొన్ని అనివార్య కారణాల వల్ల నిలిచిపోయాయి. ప్రస్తుతం రూ.35లక్షలు నిధులతో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆదేశాలతో మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి శివచంద్రారెడ్డి దగ్గరుండి రెండు పొక్లైన్లతో భారీ ఎత్తున ట్రాక్టర్లతో కాలువ పనులు ప్రారంభించారు. రోడ్డు వెడల్పు వల్ల వాహనదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. అలాగే మైదుకూరు రోడ్డు సిమెంటు రోడ్డు పనులు జరుగుతున్న కారణంగా ట్రాఫిక్ ఎర్రగుంట్ల రోడ్డుకు మళ్లించారు. రెండు పనులు వేగంగా జరుగుతున్నాయి. ఏది ఏమైనా కాలువ పనులు ప్రారంభం కావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## జులై 15 చలో తిరుపతిని విజయవంతం చేయాలి

యర్రగుంట్ల జులై 8 ప్రభాతవార్త

విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణ, కాంట్రాక్ట్ కార్మికుల విలీనం, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏల విడుదలతో పాటు 23 డిమాండ్ల సాధన కోసం స్ట్రగుల్ కమిటీ పిలుపు మేరకు జులై 15న తిరుపతిలోని సదరన్ డిస్కమ్ (ఏపీ ఎస్పీడీసీఎల్) ప్రధాన కార్యాలయం వద్ద నిర్వహించే మహా ధర్నాను విజయవంతం చేయాలని ఏపీ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నపూస సుబ్బిరెడ్డి బుధవారం పిలుపునిచ్చారు.ఆర్టీపీపీ యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నెలరోజులుగా ఆందోళనలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం, విద్యుత్ యాజమాన్యాలు ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై స్పందించడం లేదని విమర్శించారు. మార్చి నెలతో ముగిసిన వేతన సవరణ ఒప్పందానికి సంబంధించి ఇప్పటి వరకు చర్చలు కూడా ప్రారంభించకపోవడం బాధాకరమన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.తెలంగాణ తరహాలో కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేసి, రూ.43 వేల కనీస వేతనం అమలు చేయడంతో పాటు వారిని రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. థర్డ్ పార్టీ విధానాన్ని రద్దు చేసి, యాజమాన్యమే నేరుగా కార్మికులకు వేతనాలు చెల్లించాలని సూచించారు. యువగళం పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీని నెరవేర్చి విద్యుత్ కార్మికులకు న్యాయం చేయాలని నారా లోకేష్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు సి.ఓ. హరి ఓబులరెడ్డి, ఎం. నరసింహులు, ఎస్.జి. శేఖర్, పి. గిరిబాబు, హమీద్, కాంట్రాక్ట్ కార్మిక నాయకులు వి. గంగయ్య, డి. పుల్లారెడ్డి, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

దువ్వూరు, జూలై 08, ప్రభాతవార్త:



మండల కేంద్రమైన దువ్వూరు నుండి ప్రొద్దుటూరు కు వెళ్లే రహదారిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నేలటూరు గ్రామానికి చెందిన డి. లక్షుమయ్య(45) మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి నేలటూరు గ్రామానికి చెందిన లక్షుమయ్య ప్రతి రోజు కూలి పని నిమిత్తం తెల్లవారుజామునే ప్రొద్దుటూరుకు వెళుతూ ఉంటాడు. అందులో భాగంగా బుధవారం ప్రొద్దుటూరు ఒక మోటార్ సైకిల్ పై వెళ్లి పని దొరకక పోవడంతో తిరిగి నేలటూరుకు వస్తుండగా దువ్వూరుప్రొద్దుటూరు రహదారిలో గోపులాపురం క్రాస్ రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న లారీ మోటార్ సైకిల్‌ను ఢీ కొంది. ఎదురుగా వస్తున్న లారీ అతివేగంగా, అజాగ్రత్తగా రావడంతో ప్రొద్దుటూరు వైపు నుంచి వస్తున్న లక్షుమయ్య ద్విచక్ర వాహనాన్ని ఢీకొనగా లక్ష్మయ్యకు తలకు, కాళ్లకు బలమైన గాయాలు తగలడంతో అక్కడే మరణించాడు. ఈ మేరకు లక్షుమయ్య అన్న ఓబులేసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ భూషణం తెలిపారు.

# కురబలకోటలో ఫుడ్ కమిషన్ మెంబర్ ఆకస్మిక తనిఖీ

**కురబలకోట జులై 8 ప్రభాతవార్త**

ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజమాల దేవి బుధవారం కుర బల కోట మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఆమె మండలంలోని ప్రాథమిక పాఠశాల, చౌక దుకాణాలు, అంగన్వాడి కేంద్రాలను తనిఖీ చేశారు. మండల కేంద్ర మండల కేంద్రమైన కురవకోటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. గర్భవతులకు అందుతున్న సేవలను గురించి ఆరా తీశారు. నిత్యం వస్తున్న ఓపి రోగులు అందుతున్న సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలో నీ ప్రభుత్వ చౌక దుకాణాలు 1,2, తనిఖీ చేశారు. కార్డుదారులకు అందుతున్న నిత్యాసరాల గురించి అడిగి తెలుసుకున్నారు. కృపనుకోటలోని అంగన్వాడి కేంద్రాలను తనిఖీ చేసి పిల్లలకు గర్భవతులకు బాలింతలకు సరఫరా చేస్తున్న పౌష్టిక ఆహారాన్ని గురించి అడిగి తెలుసుకున్నారు. రికార్డులను రిజిస్టర్ లను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రాథమిక పాఠశాల వంటగదిని నాణ్యతను పరిశీలించారు. మధ్యాహ్నం భోజనం వాడుతున్న బియ్యం కూరగాయలు వంట సామగ్రిని గురించి పరిశీలించారు. మెనూ ప్రకారం ఒక విద్యార్థికి అందవలసిన కందిపప్పు నూనె బియ్యం కొలతల ప్రకారం ఇవ్వాలని వంట నిర్వాహకులకు ప్రధానోపాధ్యాయులకు సూచించారు. పాఠశాల ఆవరణంలో మొక్కల పెంపకం పరిసర్యాల ఆహ్లాదకరంగా ప్రశాంతంగా పరిశుభ్రంగా ఉండడంతో ప్రధాన ఉపాధ్యాయులు



కస్తూరిబా బాలికల పాఠశాలలో మెనూ తనిఖీ చేస్తున్న దృశ్యం

నరసింహులు అభినందించారు. ముదివేడు వద్ద వద్దనున్న కస్తూరిబా గాంధీ బాలిక పాఠశాలను తనిఖీ చేశారు. ఒంటరి లోని బియ్యం కూరగాయలు తదితరు వంటసామాగ్రిని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు అందుతున్న భోజనం, సౌకర్యాలను గురించి మంచి ఆరా తీశారు. బోధనపై విద్యార్థుల విద్యా ప్రమాణాలను గురించి ప్రశ్నించారు. ఆమె వెంట జిల్లా ఎండిఎం ఏడి రవికుమార్, కురబలకోట ఎంఈఓ 2 శ్రీనివాసులు, డిసిడిఓ సుమతి సిడిపిఓ సుజాత, సి ఎస్ డిటి చైతన్య, కేజీబీవీ ప్రిన్సిపాల్ రఫియా అంగన్వాడి సూపర్వైజర్లు చంద్రకాంత్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాతమ్మ జాతర

**నిమ్మనపల్లె, జులై 8 ప్రభాతవార్త :**



మమ్మలను మా గ్రామాన్ని చల్లగా కాపాడాలని గ్రామదేవత అయిన మాతమ్మకు మండలంలోని పెద్దమాదిగపల్లి గ్రామ నివాసులు బుధవారం ఘనంగా జాతరను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాతమ్మకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు అలాగే చాందిని బండ్లు, పిళ్ళనగోవి, చక్కభజనలు రాత్రిపూట జరిగాయి. గ్రామ దేవత అయిన మాతమ్మకు విశేషంగా అలంకరించి చాందిని బండ్లు ఊరేగింపుగా మహిళలు దీలు బోణాలు మోసి మొక్కులు తీర్చుకొన్నారు. ఈ సందర్భంగా గ్రామ దేవతకు జంతుబలి నిర్వహించారు. అదే విధంగా శుక్రవారం పగలు ఘనంగా జాతర జరుగుతుంది. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు కలసి చేసుకొంటున్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామమంతా భక్తాదులతో, ప్రజలతో కిటకిటలాడుతోంది.

# సమిష్టి కృష్ణతోనే పార్టీ బలోపేతం

**ప్రతి ఓటు కీలకమని భావించి పనిచేయాలి**

**టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు**



పార్టీ యూనిట్ ఇన్చార్జిల సమావేశంలో మాట్లాడుతున్న జగన్మోహన్ రాజు

**రాజంపేట, జులై 8 ప్రభాతవార్త**

క్రమశిక్షణకు మారుపేరు తెలుగుదేశం పార్టీ అని, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు సమిష్టిగా కృషి చేస్తే విజయం మనదేనని అందుకు సమన్వయంతో పాటు కలిసికట్టుగా కూడా కృషి చేయాలని పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ జగన్ మోహన్ రాజు పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి పార్టీ శ్రేణులు అంకితభావంతో కృషి చేయాలని కోరారు. టిడిపి నందలూరు మండలం నాగిరెడ్డిపల్లె, రాజంపేట పట్టణం నారపురెడ్డి పల్లె యూనిట్ స్థాయి సమావేశంలో పార్టీ పరిశీలకుడు భీమినేని చిట్టిబాబుని తో కలిసి మాట్లాడారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగినసమావేశంలో బుధవారం చమర్తి మాట్లాడుతూముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయకత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం సంక్షేమం అభివృద్ధి అనే రెండు చక్రాలపై రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తోందని పేర్కొన్నారు. ప్రతి బూత్‌లో పార్టీని మరింత పటిష్టం చేయడంతోపాటు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి అర్హులైన లబ్ధిదారునికి చేరేలా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని,అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదయాల కార్యకర్తల కృషి చేయాలని చమర్తి తెలియజేశారు. అంతేకాకుండా రానున్న స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా కలిసికట్టుగా పని చేయాలని క్యాడర్ కి దిశా నిర్దేశం జగన్ మోహన్ రాజు చేశారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు జంగం శెట్టి సుబ్బయ్య, నాగిరెడ్డిపల్లె సర్పంచ్ జంబు సూర్యనారాయణ, ప్రవీణ్ కుమార్, రాజంపేట నేతలు గుబ్బిళ్ళ చంద్రమోళి, మంద శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదకర గుంతతో వాహనదారులకు ముప్పు

**ఉన్నతాధికారులు స్పందించాలని ప్రజల విజ్ఞప్తి**



**ముద్దనూరు, జులై 08 ప్రభాతవార్త:**

ముద్దనూరు రైల్వే స్టేషన్ నుంచి ఎర్రగుంట్ల బైపాస్‌కు వెళ్లే ప్రధాన సిమెంట్ రహదారిపై అటవీశాఖ కార్యాలయం సమీపంలో నీటి కొళాయి పైపులైన్ వాల్వ్ ఏర్పాటు కోసం తవ్విన గుంతను పనులు పూర్తయిన తర్వాత పూడ్చకుండా వదిలేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే ఈ రహదారిపై గుంత చాలాకాలంగా అలాగే ఉండటంతో ప్రమాదాల ముప్పు పెరిగిందని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో గుంత కనిపించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతుండగా, ఇప్పటికే పలువురు గాయపడిన ఘటనలు చోటుచేసుకున్నాయని తెలిపారు. ఈ రహదారి వెంబడి వీధి దీపాలు లేకపోవడంతో చీకటి కారణంగా ప్రమాదాల తీవ్రత మరింత పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు స్పందించకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మేజర్ పంచాయతీ కార్యనిర్వాహణాధికారి నరసింహులు, మండల అభివృద్ధి అధికారి (స్పెషల్ ఆఫీసర్) రాధాకృష్ణ వేణి వెంటనే చొరవ తీసుకుని గుంతను పూడ్చివేయడంతో పాటు రహదారి వెంబడి వీధి దీపాలు ఏర్పాటు చేసి వాహనదారుల భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# పట్టణంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు : ఎమ్మెల్యే

**మదనపల్లె, జులై 8 ప్రభాతవార్త :**

పట్టణంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకురావాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మున్సిపల్ అధికారులకు సూచించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో నీటి ఎద్దడికి సంబంధించి కమీషనర్ ప్రమీళ, డిఈ శ్రావణి, ఏఈ రవీంద్రనాయక్‌లతో ఎమ్మెల్యే సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో ఏ వార్డులో నీటిసమస్య ఉన్నా ముందుగా గుర్తించి నివారణకు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. అదనంగా బోర్లు డ్రిల్ చేసి, నీరు తగ్గిన బోర్లను డీపినింగ్ చేసి అదనపు పైపులు అమర్చాలన్నారు. ప్రజలు ఎవరూ నీటి ఎద్దడితో ఇబ్బంది పడకుండా తగు జాగ్రత్తలు తీసు కోవాలన్నారు. ప్రధానంగా పట్టణ శివారు ప్రాంతాల్లో నీటిసమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఉర్దూ పాఠశాలలో టెట్ విద్యాసామాగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీచర్ ఎలిజిబిలిటి టెస్టుకు హాజరయ్యే మైనార్టీ విద్యార్థుల కోసం ప్రభుత్వ మైనార్టీ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా మెటీరియల్ రూపొందించి అభ్యర్థులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షాజహాన్, పఠాన్‌మహమ్మద్‌ఖాన్, మునినాయక్, రఘు, ఉపాధ్యాయులు ఇస్మాయిల్, జోహార్లు పాల్గొన్నారు.



నీటి ఎద్దడిపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే

# ఉప్పాగు కాలువ అక్రమార్కులపై

## చర్యలు తీసుకోవాలని తహసిల్దార్‌కు వినతి



**ప్రొద్దుటూరు అర్బన్, జులై 8 ప్రభాతవార్త**

ప్రొద్దుటూరు మున్సిపల్ డంపింగ్ యార్డుకు వెళ్లే రహదారి కాలువ (ఉప్పాల కాలువ) దక్షిణంవైపు కాలువ పరంబోకు స్థలాన్ని, ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని తాసిల్దార్ ఉదయ భాస్కర్ రాజుకు బుధవారం స్థానిక రైతులు వినతి పత్రాన్ని సమర్పించారు. గత 30 సంవత్సరాలుగా దక్షిణం వైపు ఉన్న కాలువను పూడ్చివేసి ఆక్రమించుకోనెందుకు స్థల యజమాని ప్రయత్నిస్తున్నారని, తద్వారా తమ పొలాల్లో నీరు నిలుస్తుందని తెలిపారు. దక్షిణం వైపు కాలవను ఆక్రమించడమే కాకుండా ఇదేమిటని ప్రశ్నించిన రైతులను దూషించడమే కాకుండా మీరు ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ ప్రశ్నించిన రైతులపై ఎదురు తిరిగారన్నారు. కాలువను ఆక్రమించుకొన్న వారిపై తగు చర్యలు తీసు కోవాలని తాసిల్దార్ను వినతి పత్రము ద్వారా కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో మార్తల శ్రీనివాసులరెడ్డి, బి. సుబ్బారెడ్డి, పుల్లారెడ్డి, కే.లక్ష్మారెడ్డి, డి.శ్రీనివాసులు రెడ్డి, పి.నాగేష్, బీసీ గురప్ప, మాల కొండారెడ్డి, గంగిరెడ్డి, లింగారెడ్డి భూయజమానులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ మ్యాపింగ్ 100 శాతం చేయాలి



**సిద్దవటం జులై 8 ప్రభాతవార్త**

బిఎల్ఓ లు 100 శాతం ఎస్ఐఆర్ మ్యాపింగ్ పూర్తి చేయాలని కడప డిఆర్ఓ మల్లికార్జునుడు ఆదేశించారు. సిద్దవటం మండలంలోని భాకరాపేట సచివాలయంలో బుధవారం బిఎల్ఓ లు చేస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన డిఆర్ఓ వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఎల్ఓ లకు ఎన్యుమరేషన్ ఫారం లను డిజిటలైజేషన్ చేసేందుకు సహాయంగా అంగన్వాడీ కార్యకర్తలు, ఎస్.హెచ్.జి విఓఏ లను నియమించడం జరిగిందన్నారు. డబుల్ ఎంట్రీలు, చనిపోయిన, వలసదారుల ఓట్లను తొలగించి మిగిలిన ఓటర్ల మ్యాపింగ్ చేసి డిజిటలైజేషన్ ను జులై 14 లోగా పూర్తి చేయాలన్నారు. ఈ నెల 12వ తేదీన ఎస్ఐఆర్ ను తనిఖీ చేసేందుకు మరోసారి వస్తానని అప్పటిలోగా బిఎల్ఓలకు నిర్దేశించిన లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్ కుమార్, బిఎల్ఓలు పాల్గొన్నారు.

# నియోజకవర్గ నూతన కార్యవర్గం ఏర్పాటు

**రాజంపేట, జులై 8 ప్రభాతవార్త**

వడ్డెర సంక్షేమ సంఘం రాజంపేట నియోజకవర్గ నూతన కార్యవర్గం ఎన్నిక స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో బుధవారం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా రాష్ట్ర నేతలు దేరంగుల శ్రీనివాసులు, వడ్డే రమణ, బత్తల జానకిరామ్, శీను, గంపశివ, బండారు వెంకటరమణ పాల్గొన్నారు. రాజంపేట నియోజకవర్గ అధ్యక్షుడుగా బత్తల సుబ్బరాయుడు , ఉపాధ్యక్షులుగా కార్యదర్శిగా గంప దేవేంద్ర ,బత్తల బాలాజీ, రాయచోటి నాగార్జున ప్రధాన కార్యదర్శిగా వల్లెపు ఆనంద్, కార్యదర్శులుగా బత్తల నరసింహులు, తదితర సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



# మహా ధర్నాను జయప్రదం చేయండి



**దువ్వూరు, జులై 08, ప్రభాతవార్త:**

విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15వ తేదీన తిరుపతిలో చేపట్టే మహాధర్నాను జయప్రదం చేయాలని విద్యుత్ ఉద్యోగుల స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయబ్ రసూల్ తదితరులు అన్నారు. దువ్వూరు సబ్ స్టేషన్ నందు కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాజమాన్యం, ప్రభుత్వము విద్యుత్ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని అందుకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతున్నామన్నారు. అందులో భాగంగా ఈనెల 15వ తేదీన తిరుపతి ఎస్పీడీసీఎల్ ఆఫీస్ వద్ద మహాదర్నా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వేతన సవరణ కమిటీ వెంటనే ఏర్పాటు చేయాలని, పెండింగ్లో ఉన్న 4 కరువు భత్యాలు విడుదల చేయాలని, ఉద్యోగుల కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షుడు రమణ, వరధారెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఎస్ఐఆర్ నమోదు శిబిరం

**కడప, జులై 8 ప్రభాతవార్త:**

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా కలెక్టరేట్‌లోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సౌలభ్యం కోసం బుధవారం కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు ఆధ్వర్యంలో ప్రత్యేక ఎన్యూమరేషన్ ఫారం నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక ఎస్.ఐ. ఆర్. నమోదు ప్రక్రియను కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేయడమైనదన్నారు. విధి నిర్వహణలో నిమగ్నమై ఉండే ఉద్యోగులు తమ నివాసాల వద్ద బూత్ స్థాయి అధికారులకు (బీఎల్ఓ) సకాలంలో అందుబాటులో ఉండకపోవడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు సులభంగా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించేందుకు కలెక్టరేట్ ప్రాంగణంలోనే ప్రత్యేక నమోదు శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక శిబిరంలో సేకరించిన ఎన్యూమరేషన్ ఫారాలను సంబంధిత బీఎల్ఓలకు అధికారులు నేరుగా అందజేసి, ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయనున్నట్లు డీఆర్వో పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఓటరు వివరాలు ఖచ్చితంగా నమోదయ్యేలా అందరూ సహకరించాలని ఆయన కోరారు.

# వైయస్సార్ 77వ జయంతి వేడుకలు

**పాత బస్టాండ్‌లో వైయస్సార్ విగ్రహానికి నివాళులు**

**కేక్ కట్ చేసి సంబరాలు**

**పులివెందుల, జులై 8 ప్రభాతవార్త :**

పులివెందుల పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలను మున్సిపల్ ఇంచార్జ్ మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణ నాయకులు, మహిళా కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వైయస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి జయంతి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ వైయస్సార్ పేదల సంక్షేమం కోసం అమలు చేసిన పథకాలు, రైతులు, విద్యార్థులు, మహిళల అభ్యున్నతికి చేసిన సేవలను స్మరించుకొని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.వేడుకల సందర్భంగా "వైయస్సార్ అమర్ రహే" అంటూ కార్యకర్తలు నినాదాలు చేయడంతో పాత బస్టాండ్ పరిసరాలు మారుమోగాయి.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ కౌన్సిలర్లు, పట్టణ నాయకులు, పార్టీ కార్యకర్తలు, మహిళలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని వైయస్సార్‌కు ఘన నివాళులు అర్పించారు.



కేక్ కట్ చేస్తున్న దృశ్యం

# పామాయిల్, వెదురు సాగుతో అధిక లాభాలు

**మైదుకూరు, జులై 08, ప్రభాతవార్త:**

రైతులు పామాయిల్ సాగు పెంపకం చేపడితే మంచి లాభాలు సాధించవచ్చని మైదుకూరు ఉద్యాన అధికారి సి. రామకృష్ణ అన్నారు.బుధవారం మైదుకూరు మండలం నంద్యాలంపేట రైతు సేవా కేంద్రంలో ఉద్యాన శాఖ మరియు సువెన్ ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో "పామాయిల్ సాగుపై రైతు శిక్షణ" కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రైతులకు పలు సబ్సిడీలపై ఈ విధంగా ముఖ్యమైన వాటిపై తెలియజేస్తూ పామ్ ఆయిల్ సాగుకు ఎకరాకు 50 మొక్కలు చొప్పున నాటుకోవాలి. మొక్కలను ఉచితంగా సువెన్ ఆగ్రో ఇండస్ట్రీస్ వారు సరఫరా చేస్తారు. మొక్కల నిర్వహణకు మరియు ఆంతర పంటల సాగుకు హెక్టారుకు రూ. 10,500 చొప్పున 4 సంవత్సరాల పాటు సహాయం అందిస్తారు.జాతీయ వెదురు మిషన్ కింద ఎకరాకు 400 వెదురు మొక్కలు నాటితే మొదటి సంవత్సరం రూ. 36,000, రెండవ సంవత్సరం రూ. 24,000 రాయితీ లభిస్తుంది. సాగు పద్ధతులు: సంవత్సరం పొడుగునా 2 అంగుళాల నీరు అందుబాటులో ఉంటే 5 ఎకరాల వరకు నిరభ్యంతరంగా పామాయిల్ సాగు చేసుకోవచ్చు. మొక్కలను 9 మీటర్ల దూరంలో నాటాలి.నాటిన 3 సంవత్సరాల తరువాత దిగుబడి ప్రారంభమవుతుంది. ఎకరాకు 4వ సంవత్సరంలో 4 టన్నుల వరకు, 7వ సంవత్సరం నుండి 8 నుండి 10 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ప్రజెంట్ మార్కెట్ ప్రస్తుతం పామాయిల్ ధర టన్నుకు రూ. 23,770 గా ఉంది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సువెన్ ఆగ్రో ఇండస్ట్రీస్ జీఎం కొండారెడ్డి పామాయిల్ పంట యాజమాన్య పద్ధతులను వివరించారు. గ్రామ ఉద్యాన రైతు సేవా కేంద్ర అధికారి మధుసూదన్ రెడ్డి, నంద్యాలంపేట గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సర్ ఓటర్ల జాబితాపై పరిశీలించి విచారణ

**రాయచోటి జూలై 8 ప్రభాతవార్త**

కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన సర్ ఓటర్ల జాబితాపై అన్నమయ్య జిల్లా రాయిచోటి ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి మరియు ఆర్డీవో శ్రీనివాస్, రాయచోటి మున్సిపల్ కమిషనర్ పి రమణారెడ్డిలు బుధవారం అన్నమయ్య జిల్లా రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని జగదాంబ సెంటర్,కొత్తపేట, రామాలయం, ఎస్ఎన్ కాలనీ, గున్నిగుంట్ల రోడ్డు తదితర పోలింగ్ బూతులలో పరిశీలించి విచారణ చేపట్టారు. ఓటర్ల ఎస్ ఐ ఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలని రాయచోటిలోని పలు సచివాలయాల పరిధిలోని పోలింగ్ కేంద్రాలలో స్థానిక రాజకీయ పార్టీ నాయకులు, ప్రజలతో వారు మమేకమై కలయ తిరిగి క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. ఏ పోలింగ్ కేంద్రాలలో అయితే ప్రగతి తక్కువగా నమోదయి ఉన్నదో ఆయా పరిసరాలకు సంబంధిత బిఎల్ఓలను వెంటబెట్టుకుని ప్రజలతో పరస్పరం సహకరించు కుంటూ ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ సందర్భంగా ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి మరియు ఆర్డీవో శ్రీనివాస్ మాట్లాడుతూ రాయచోటి మున్సిపల్ పరిధిలో ఓటర్ల సర్ ప్రక్రియలో భాగంగా కొన్ని సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన పేర్కొన్నారు. అవేమిటంటే కొందరు ఓటర్లు సొంత గ్రామాలలో నమోదు ఉండి, ఇక్కడ రాయచోటి పట్టణంలో కూడా ఓటు హక్కు కలిగి ఉండటం మరియు బిఎల్ఓ లకు సహకరించకపోవడం, కొందరు ఇంటి వద్ద లేకుండా పోవడంతో సర్ ప్రక్రియ వేగవంతం కాక పోవుటకు ఒక కారణమని ఆయన తెలిపారు. అదియును గాక రెండు( వేరు వేరు ) ప్రాంతాలలో ఓటు హక్కు కలిగి ఉండి ఎటూ తేల్చుకోలేని( గ్రామాల్లోన పట్టణంలోన ) పరిస్థితుల్లో వారు ఉండడంతో సర్ ప్రక్రియ నెమ్మదించడం ఒక్క కారణం అన్నారు. నేను మా సిబ్బంది, రాజకీయ పార్టీ నాయకులు మరియు ప్రజలతో కలిసి ఈ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయుటకు తమ వంతుగా కృషి చేస్తున్నామని ఆయన అన్నారు. వేరువేరు ప్రాంతాల్లో ఒకరికి రెండు లేక మూడు ప్రాంతాలలో ఓటు నమోదు అయి ఉన్నట్లయితే అలాంటివారికి ఏ ప్రాంతంలో కూడా ఓటు వేసే వేసే అధికారాన్ని కోల్పోతారని, ఇలాంటి పరిస్థితి మీకు రాకుండా ఉండాలంటే ఏదో ఒక ప్రాంతంలో మాత్రమే ఓటును నమోదు చేసుకోవాలని ఈ ప్రత్యేక అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆర్డీవో శ్రీనివాస్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి మాట్లాడుతూ రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు మాతో సహకరించి తప్పులు లేని ఓటర్ల జాబితాకు తమ వంతుగా సహకరించాలని ఆయా కేంద్రాల్లోని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ జి ఎస్ డబ్ల్యూ మేనేజర్ బోడేపల్లి శ్రీనివాసరావు, సూపర్వైజర్లు, బి ఎల్ వో లు మరియు ప్రజలు పాల్గొన్నారు.



# కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎంపీ

**వేంపల్లె జూలై 08 ప్రభాతవార్త**

మండలంలోని తాళ్లపల్లె గ్రామం వద్ద ఈనెల 1వ తేదీన బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన మురళీకృష్ణ, వెంకట లక్ష్మమ్మ కుటుం బ సభ్యులను కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి పరామర్శించారు. బుధ వారం ఆయన వారి సగృహానికి వెళ్లి పార్టీ తరఫున అండగా ఉంటానని భరోసా కల్పించారు. కత్తులూరు పంచాయతీ తాటిమాకుల పల్లె గ్రామం ఎస్సీ కాలనీలో నివాసముంటున్న మురళీకృష్ణ, వెంకటలక్ష్మి దంపతులు తాళ్లపల్లె గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన ఉదయం పూట టిఫిన్, సాయంత్రం పూట బొరుగులు మిక్చర్, అప్పలాలు విక్రయిస్తూ జీవనం సాగిస్తూ ఉండేవారు. వీరికి కుమార్తె రేణుక ఉన్నది.ఈ క్రమంలో ఈ నెల ఒకటవ తేదీన దుకాణం మీదికి లారీ దూసుకు రావడంతో దంపతులు ఇద్దరూ లారీ కింద పడి నుజ్జు నుజ్జు అయ్యి అక్కడే మరణించారు. దీంతో ఒక్కగానొక్క కుమార్తె రేణుక అనాధగా మారింది. రేణుక కడపలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి డిగ్రీ చదువుకోవాలనుకున్నది. ఇంతలోనే ఈ ఘటన జరగడంతో తనకు దిక్కెవరని అయోమయంలో పడింది. ఈ నేపథ్యంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి తన స్వగృహానికి వెళ్లి బాగా చదువుతేనే భవిష్యత్తు ఉంటుందని ఎంపీ భరోసా కల్పించారు. అందుకు నీ చదువు పూర్తయ్యేంతవరకు నేను చదివిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. జరిగిన ఘటనను గురించి మృతుడు మురళీకృష్ణ తల్లి అంకమ్మ, కుమార్తె రేణుకను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రవికుమార్ రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఆర్ ఎల్ వి ప్రసాద్ రెడ్డి, రాష్ట్ర బీసీ ప్రధాన కార్యదర్శి గంగాధర్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కుట్లూరు సుదర్శన్, మాజీ సొసైటీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, రాజ్ కుమార్, తదితర వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.



# నిబద్ధతతో ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించాలి

**కడప, జులై 8 ప్రభాతవార్త:**

ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని.. నిబద్ధతతో పనిచేస్తూ.. కుటుంబాలకు ఆసరాగా నిలవాలని.. కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగాలు పొందిన వారికి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సూచించారు. కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కారుణ్య పథకం ద్వారా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు పొందిన మొత్తం 58 మందికి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు పొందిన వారిని ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగాలు పొందిన వారు.. ఇంట్లో పెద్దదిక్కుగా వ్యవహరిస్తూ ఇటు ఉద్యోగ ధర్మాన్ని, అటు ఇంటి బాధ్యతలను మరువకుండా నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం రెండేళ్ల ప్రొబేషన్ పీరియడ్‌లో ప్రభుత్వ ఉద్యోగిగా నిర్వర్తించగలిగే విధులపై పూర్తి స్థాయి అవగాహన పెంచుకోవాలన్నారు. ఎక్కడా కూడా అక్రమార్జనకు ఆశపడకుండా.. సక్రమమైన మార్గంలో నడుస్తూ ఉద్యోగ ధర్మంలో గౌరవాన్ని పెంపొందించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో మల్లికార్జునుడు, కలెక్టరేట్ ఏ.ఓ. గంగయ్య, ఉద్యోగాలు పొందిన కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

